VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 08.09.2026

సంపుటి : 09 సంచిక : 89, పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07: అసెంబ్లీలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో కలిసి "దుద్దిళ్ల శ్రీపాదరావు సెంట్రల్ హాల్" ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.

## శాసనసభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

- సభలో చర్చల అనంతరమే నిర్ణయాలు.. అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 7:** శాసనసభలో ఏ అంశంపైనైనా కూలంకషంగా చర్చ జరిగిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవడం సభా సంప్రదాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ లేవనెత్తిన అంశాల పైనా సమగ్రంగా చర్చించిన తర్వాతే సభ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. చర్చ లేకుండానే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేయడం వెనుక తమ చీకటి మిత్రులను కాపాడాలనే ప్రయత్నం ఉందని ఆయన విమర్శించారు.ఇదే శాసనసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చించి, అనంతరం విచారణకు ఆదేశించిన విషయాన్ని సీఎం గుర్తుచే శారు. సభా సంప్రదాయాలను, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందన్నారు.సభలో ముఖ్యమంత్రి అయినా, సాధారణ శాసనసభ్యుడైనా స్పీకర్‌కు సమానమేనని, సభాపతి స్థానానికి అత్యున్నత గౌరవం ఇవ్వాల్సి ఉంటుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మనసు గాయపడేలా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరించారని ఆక్షేపించారు.

▶ మిగతా 2లో

## తెలంగాణ నీటి కష్టాలకు
## ఎల్‌నినోతోడు కేసీఆర్ వైఫల్యాలు

- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుచేసినా అసంపూర్తిగానే సాగునీటి ప్రాజెక్టులు
- పాలమూరు–రంగారెడ్డిపై 90 శాతం పనులు పూర్తయ్యాయనడం పచ్చి అబద్ధం
- గడిచిన మూడు జల సంవత్సరాల్లో కృష్ణా న్యాయవాటాను సమర్థంగా వినియోగించుకున్నాం
- ప్రధాన పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- శాస్త్రీయ పద్ధతుల్లో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7:** తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి సమస్యకు ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు కారణమైతే, మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగంలో చోటుచేసుకున్న వైఫల్యాలు ప్రధాన కారణమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.ప్రకృతి సృష్టించిన ప్రతికూల పరిస్థితులకు గత ప్రభుత్వ అసమర్థ సాగునీటి విధానాలు తోడవడంతోనే రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చిందన్నారు."తెలంగాణ రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఇద్దరే కారణం..



2

## ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ నిరంకుశ పాలన

- విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెట్టి.. బారికేడ్ల వెనుక దాక్కుంటారా?
- ధర్నాకు చోటివ్వరు.. అసెంబ్లీ వద్దకు శాంతియుతంగా వస్తే లాఠీలతో విరుచుకుపడతారా?
- ప్రశ్నిస్తే అరెస్టులు.. నిలదీస్తే నిర్బంధాలు.. ఇదేనా కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన?
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేదాకా 22వ భూ దందాపై విచారణ జరిపేదాకా బీజేపీ పోరాటం ఆగదు



2

- కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ వెలుతురు 7 సెప్టెంబర్, 2026:** తెలంగాణలో ప్రజాస్వామ్య పాలన అందిస్తామని గొప్పలు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..



2

## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును సస్పెండ్ చేయాలి

- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

## అసెంబ్లీ ముట్టడి సందర్భంగా గాయపడిన బీజేపీ అధికార ప్రతినిధి ప్రభా గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:** హైదరాబాద్‌లో సోమవారం రోజున బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి శ్రీమతి ప్రభా గౌడ్ గారి కాలు విరగడంతో, నాంపల్లి కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమెను ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ పాయల్ శంకర్ గారు పరామర్శించారు.

ప్రభా గౌడ్ గారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు, ఆమెకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయం అందేలా చూసుకుంటామని భరోసా ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేస్తున్న పోరాటంలో కార్యకర్తలు,

నాయకులు ధైర్యంగా ముందుకు సాగుతున్నారని, ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని పాయల్ శంకర్ గారు తెలిపారు.



అసెంబ్లీలో "దుద్దిళ్ల శ్రీపాదరావు సెంట్రల్ హాల్" ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జూపల్లి కృష్ణారావు.
హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

- ఆటో ఛార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలం కమిటీ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపు అమలు
- లాస్ట్ మైల్ కనెక్టివిటీ లో భాగంగా ఆర్టీసీ ఈవీ ఆటో లు నడిపే ప్రసక్తే లేదు ఇది దుష్ప్రచారం మాత్రమే
- ఓలా, ఉబెర్ తరహా లో ప్రభుత్వమే యాప్ ప్రవేశపెట్టడానికి ఐటీ శాఖ తో సంప్రదింపులు జరిపాం
- హైదరాబాద్‌లో 18,700 ఆటోలకు రెట్రోఫిట్మెంట్ కోసం రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం



12


- ఆటో కార్మిక సంఘాల సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7:**

## సింగరేణిలో 'మారుపేర్ల' సమస్య పరిష్కారానికి మానవీయ కోణంలో ప్రభుత్వం పరిశీలిస్తుంది

- శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL)లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'మారుపేర్ల' సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ శాసనమండలిలో స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. శాసన మండలి సమావేశాల్లో ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ, ఇది ఇటీవల ఉత్పన్నమైన సమస్య కాదని, 1990వ దశకంలో అనగా 1997 నుంచే సింగరేణిలో కొనసాగుతున్న పాత (లెగసీ) సమస్య అని వివరించారు. అధికారిక రిజిస్టర్‌లో ఒకరి పేరు ఉంటే, వారి స్థానంలో మరొకరు వచ్చి విధుల్లో పనిచేస్తున్న పరిస్థితులు ఉండేవి. చట్టప్రకారం ఒకరి పేరు మీద మరొకరు ఉద్యోగం చేయడం అంశమైనప్పటికీ, కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకొని సింగరేణి యాజమాన్యం గతంలో మానవీయ కోణంలో పరిష్కరించేందుకు ప్రయత్నించిందని గుర్తుచేశారు.



2

## అసెంబ్లీ మొదటి రోజే ఆందోళనలు, రాజకీయాలు

- జనసేన నాయకురాలు హైందవి రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:** తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నడుస్తున్న రాజకీయం రాష్ట్ర ప్రజల తలదించుకునేలా ఉందని, గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీల తీరులో ఎలాంటి తేడా లేదని జనసేన రాష్ట్ర నాయకురాలు హైందవి రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలేసి, పరస్పర ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, దాడులు మరియు వివాదాస్పద అంశాలపై రాజకీయాలు చేయడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హైందవి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..."తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడిన గడ్డ ఇది. కానీ నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అయినా, గతంలో పరిపాలించిన బీఆర్ఎస్ అయినా రాజకీయ దిగజారుడుతనంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నాయి. చీరలు పంచుకోవడం, బూతులు తిట్టుకోవడం, భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు సిగ్గుచేటు. ప్రజలు ఏ ఆశలతోనైతే రెండు పార్టీలకు అధికారం కట్టబెట్టారో, వాటిని నిలబెట్టాల్సింది పోయి రోడ్డెక్కి తలవంపులు తెచ్చేలా ప్రవర్తించడం క్షమించరానిది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, రైతుల కష్టాలు, అభివృద్ధి కుంటుపడుతుంటే ఇరు పార్టీలు కేవలం రాజకీయ లబ్ధి కోసం ఈ స్థాయికి దిగజారడం దురదృష్టకరమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు ఈ క్షుద్ర రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన విధంగా బుద్ధి చెబుతారని హైందవి రెడ్డి హెచ్చరించారు.



## అసెంబ్లీ గేట్ వద్ద బీజేపీ నేతల అరెస్ట్

- కుల్సుంపుర పోలీస్ స్టేషన్ కు తరలింపు
- అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్
- ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు సహా ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ఉద్యమిస్తామన్న బండి సంజయ్
- కాంగ్రెస్ ను గద్దె దించేదాక విశ్రమించేది లేదన్న బండి సంజయ్



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

## ఇన్వెస్ట్ తెలంగాణ – తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సన్నాహకాలపై సీఎస్ సమీక్ష

- ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖులకు ఆహ్వానాలు పంపాలి: సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7:** రానున్న ఇన్వెస్ట్ తెలంగాణ – తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సన్నాహకాలను సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈఓలు, సీఎక్స్ఓలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానిం చేలా చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశిం చారు. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ–మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులకు సమర్థవంతంగా ప్రదర్శిం చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఈ సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణ ఆదిత్య, అజిత్ రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# శాసనసభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

ఇది వ్యక్తిగతంగా గడ్డం ప్రసాద్ కుమార్‌కు జరిగిన ఘటన కాదని, స్పీకర్ పదవికి జరిగిన అవమానంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు.సభాపతిని గౌరవించడం తెలంగాణ సంప్రదాయమని, కానీ స్పీకర్‌పై సభ్య సమాజం తలదించుకునేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనను సభ గౌరవానికి సంబంధించిన అంశంగా భావించి సభ్యులు చర్చకు తీసుకువచ్చారని తెలిపారు. భవిష్యత్ తరాలు మన నుంచి నేర్చుకునే విధంగా శాసనసభలో సభ్యుల వ్యవహారశైలి ఉండాలని సూచించారు.నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ఇది అవమానకర ఘటనగా ఆయన అభివర్ణించారు. తెలంగాణ చరిత్రలో ఇది ఒక చీకటి రోజని పేర్కొంటూ, ఇంత అనుచిత భాషతో దూషించడం క్షమించరాని విషయమన్నారు. సభాపతిని, ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు.ఇది కేవలం దళితులకు జరిగిన అవమానం మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని సీఎం అన్నారు. గతంలో దళితులకు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, దళిత బంధు అమలు చేస్తామని హామీలు ఇచ్చి, అనంతరం దళిత ఉప ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించారని ఆరోపించారు.నేరెళ్ల ఘటనలో ఇసుక లారీలను అడ్డుకున్న దళితులపై లారీలతో దాడి చేసి చంపారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఒక దళితుడిని కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిగా చేస్తే, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్ష హోదా నుంచి తొలగించారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు దళిత వ్యతిరేక ఆలోచనా విధానం, దళిత వ్యతిరేక వైఖరి ఉందని ఆరోపించారు.తల్లిని అవమానించేలా మాట్లాడటం ప్రతి ఒక్కరినీ అవమానించినట్లేనని, ఇలాంటి వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు.ప్రభుత్వం సంయమనం పాటిస్తే దానిని చేతకానితనంగా భావించవద్దని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అదిరించి, బెదిరించి వ్యవస్థలను లొంగదీసుకుంటామంటే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.సభా నాయకుడిగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో రాజీనామా చేయించాలని, సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేసిన సభ్యుడి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

# సింగరేణిలో 'మారుపేర్ల' సమస్య పరిష్కారానికి మానవీయ కోణంలో ప్రభుత్వం పరిశీలిస్తుంది

అయితే, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆ సమయంలో 45 మంది అధికారులతో పాటు సంబంధిత వ్యక్తులపైనా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సింగరేణిలో ప్రస్తుతం దాదాపు 90 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, ఈ మారుపేర్ల సమస్యను ఎదుర్కొంటున్న వారి సంఖ్య కేవలం 128 మాత్రమేనని భట్టి విక్రమార్క తెలిపారు. ఇది భారీ సంఖ్యలో ఉన్న పెద్ద సమస్య కాకపోయినప్పటికీ, చట్టపరమైన చిక్కులు ఉన్నందున అధికారులు ఈ సమస్యను పరిష్కరించేందుకు భయపడుతున్నారని చెప్పారు. ఒకవైపు నిబంధనల ప్రకారం భవిష్యత్తులో చర్యలు ఉంటాయనే అధికారుల భయం, మరోవైపు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిడిని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిందని తెలిపారు. కార్మికులు చాలా ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్నందున, ఏ ఒక్క అధికారిపైనా భారం పడకుండా కమిటీ ద్వారా మానవీయ కోణంలో సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే నియమించిన కమిటీ నుంచి నివేదిక రాగానే సదరు 128 మంది మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును సస్పెండ్ చేయాలి


దళిత స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ తాత మధు తన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి, శాసన మండలి నిబంధనల ప్రకారం తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయాలని కోరారు.దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అవమానాలు, కుల వివక్షకు తావులేదన్నారు.ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ఘటనపై స్పందించి, ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను ఖండించడంతో పాటు దళిత సమాజానికి, స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. శాసన వ్యవస్థ ప్రతిష్టను కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# రాహుల్ గాంధీ గారి భారత్ జోడో యాత్ర - దేశాన్ని ప్రేమతో ఐక్యం చేసిన చారిత్రాత్మక ప్రస్థానం

- **డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

రాహుల్ గాంధీ గారు చేపట్టిన చారిత్రాత్మక భారత్ జోడో యాత్ర ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత్ జోడో యాత్రలోని అపూర్వ ఘట్టాలు, ప్రజల విశేష భాగస్వామ్యం, దేశ ఐక్యతను చాటిచెప్పిన స్ఫూర్తిదాయక సందర్భాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆమె సందర్శించారు." భారత్ జోడో యాత్ర కేవలం ఒక రాజకీయ పాదయాత్ర కాదు. విద్వేషంపై ప్రేమను, విభజనపై ఐక్యతను, భయంపై ఆశను గెలిపించిన చారిత్రాత్మక ప్రజా ఉద్యమం. రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, అన్ని వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాద యాత్ర చేశారు" అని డా. రేఖ బోయలపల్లి పేర్కొ న్నారు.రాహుల్ గాంధీ గారి స్ఫూర్తిదా యక నాయకత్వంలో రాజ్యాంగ పరిరక్షణకు, సామా జిక న్యాయ సాధనకు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు మరియు అణగారిన వర్గాల హక్కులు, ఆత్మ గౌరవం కోసం మహిళా కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు."భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ బలం. ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం, న్యాయం లభించే సమ్మిళిత భారతదేశ నిర్మాణానికి మేము కట్టుబడి ఉన్నాం" అని ఆమె తెలిపారు.



# ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ నిరంకుశ పాలన

ఇప్పుడు ప్రజా సమస్యలపై గొంతెత్తితే అరెస్టులు, ప్రశ్నిస్తే నిర్బంధాలు, నిరసన తెలిపితే లాఠీలతో సమాధానం చెబుతోంది. ఇదేనా కాంగ్రెస్ చెప్పిన ప్రజాపాలన? ఇదేనా రాహుల్ గాంధీ పదేపదే మాట్లాడే ప్రజాస్వామ్యం?

రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన రూ.15 వేల కోట్ల ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, వివాదాస్పద 22-A జాబితాలో చేర్చిన అమాయక ప్రజల ప్రైవేటు భూములకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ వైపు శాంతియుతంగా వెళ్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు వ్యవహరించిన తీరును నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.విద్యార్థుల గొంతుకగా నిలబడేందుకు బీజేపీ తరపున ఉద్యమబాట పట్టిన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారిని అసెంబ్లీ వద్ద బలవంతంగా లాక్కెళ్లి అక్రమంగా అరెస్టు చేయడం దారుణం. పార్టీ నాయకులు, బీజేవైఎం కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వంలో పెరుగుతున్న అసహనానికి, అభద్రతకు నిదర్శనం.

**ప్రభుత్వానికి ఇంత భయమెందుకు?**

**విద్యార్థుల తరపున ప్రశ్నిస్తే భయమా?**

**22ఏ భూముల గురించి నిలదీస్తే భయమా?**

**ప్రతిపక్ష నాయకులు అసెంబ్లీ వైపు వస్తేనే ప్రభుత్వానికి ఎందుకంత ఉలికిపాటు?**

సభ లోపల బీజేపీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా అడ్డుకోవడం.. సభ బయట ప్రజల తరపున గొంతెత్తుతున్న బీజేపీ నాయకులను పోలీసులతో అరెస్టు చేయించడం.. ఇది ప్రజాస్వామ్య పాలన కాదు. పక్కా నియంతృత్వం.ధర్నాచౌక్‌లో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వరు.ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అసెంబ్లీ వద్దకు వస్తే బారికేడ్లు పెడతారు.నాయకులను అరెస్టు చేస్తారు.కార్యకర్తలపై లాఠీలు ప్రయోగిస్తారు .విద్యార్థుల సమస్యలకు సమాధానం చెప్పలేక బారికేడ్ల వెనుక దాక్కుంటారా? ఎన్నికల హామీలు అమలు చేయలేక పోలీసుల వెనుక దాక్కుంటారా?అధికారంలోకి రావడానికి విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని గాలికొదిలేశారు. ఇప్పుడు అదే హామీల గురించి అడిగితే.. సమాధానం చెప్పకుండా పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారు.ఒక్క విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గుర్తుపెట్టుకోవాలి. పోలీసులతో ప్రజాసంక్షేమానికి సంబంధించిన ప్రశ్నలను ఆపలేరు. బారికేడ్లతో ప్రజల ఆవేదనను అడ్డుకోలేరు. అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరు. లాఠీలతో విద్యార్థుల సమస్యలను పరిష్కరించలేరు.అదే సమయంలో రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. 22-A భూముల వ్యవహారంలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి. బాధితులకు న్యాయం చేయాల్సిందే.అరెస్టులకు భయపడేది లేదు. నిర్బంధాల కు వెనక్కి తగ్గేది లేదు. లాఠీలకు తలవంచేది లేదు. విద్యార్థులకు న్యాయం జరిగేదాకా.. 22-A బాధితులకు న్యాయం జరిగేదాకా.. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం ఆగదు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగా అణచివేయాలని ప్రయత్నిస్తే.. అంతకంటే బలంగా ప్రజల గొంతుకై నిలబడతాం.

# తెలంగాణ నీటి కష్టాలకు ఎల్‌నినోతోడు కేసీఆర్ వైఫల్యాలు

**శాసనసభ లాబీల్లో సోమవారం మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిట్-చాట్ నిర్వహించారు.**

. ఒకరు మిస్టర్ ఎల్‌నినో, మరొకరు మిస్టర్ కేసీఆర్" అని ఆయన వ్యాఖ్యానించారు.ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, నీటి లభ్యతపై ప్రభావం చూపే అంతర్జాతీయ వాతావరణ పరిణామమని వివరించారు. దానిని తెలంగాణ ప్రభుత్వం సృష్టించలేదని, దాని ప్రభావం ఒక్క తెలంగాణకే పరిమితం కాలేదని గుర్తుచేశారు. నీటి లభ్యత తగ్గే అవకాశాలను ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం, నీటి వసతి అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు పలుమార్లు సూచించిందన్నారు.

**రాజకీయ భాషా ప్రమాణాలను దిగజార్చింది కేసీఆరే**

తెలంగాణ రాజకీయాల్లో భాషా ప్రమాణాలు దిగజారడానికి కేసీఆరే కారణమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. "కేసీఆర్‌కు ముందు రాజకీయ నాయకులు ఈ తరహా భాషను ఉపయోగించేవారు కాదు. ఒకప్పుడు వీరత్వంగా ప్రచారం చేసుకున్న మాటలే ఇప్పుడు రాజకీయ సంభాషణను కలుషితం చేశాయి" అని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్‌పై తమ ప్రధాన విమర్శ రాజకీయ భాషకు మాత్రమే పరిమితం కాదని, సాగునీటి రంగంలో ఆ ప్రభుత్వం ప్రదర్శించిన ఘోర వైఫల్యమే అసలు అంశమని స్పష్టం చేశారు.

**రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంపై సుమారు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ, రాష్ట్ర ఆవిర్భావ సమయానికి పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులలో ఒక్కదానినీ సంపూర్ణంగా పూర్తి చేయలేకపోయారని మంత్రి ఉత్తమ్ విమర్శించారు.కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎస్ఎల్‌బీసీ సొరంగం వంటి కీలక ప్రాజెక్టులు భారీగా నిధులు వెచ్చించినప్పటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయని పేర్కొన్నారు. సాగునీటి ప్రయోజనాలకు అనుగుణంగా ఫలితాలు సాధించకుండా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఆర్ఈసీ వంటి సంస్థల నుంచి అధిక వడ్డీలకు భారీ రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. ఆ అనాలోచిత అప్పుల భారాన్ని చివరకు తెలంగాణ ప్రజలే మోయాల్సి వస్తోందన్నారు.

**పాలమూరు–రంగారెడ్డిపై బీఆర్ఎస్‌వి భ్రమలు మాత్రమే**

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రచారాన్ని మంత్రి ఉత్తమ్ తీవ్రంగా తప్పుబట్టారు. సుమారు రూ.27,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, పంట పొలాలకు నీటిని చేర్చే డిస్ట్రిబ్యూటరీ కాలువల వ్యవస్థను నిర్మించలేదని తెలిపారు.కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా నామమాత్రంగానే జరిగిందని, అటువంటి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు.పాలమూరు–రంగారెడ్డి పథకం నీటి వనరును జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడంపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. జూరాల పూర్తిగా తెలంగాణ భూభాగంలో ఉన్న ప్రాజెక్టు కాగా, శ్రీశైలం తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ జల సంబంధాల్లో ఉమ్మడి జలాశయమని గుర్తుచేశారు. జూరాలనే నీటి వనరుగా కొనసాగించి ఉంటే అంతర్రాష్ట్ర సమస్యలకు తావులేకుండా తెలంగాణ మరింత సులభంగా నీటిని వినియోగించుకునే అవకాశం ఉండేదన్నారు.

**కాంగ్రెస్‌ను ప్రశ్నించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు**

పదేళ్లపాటు అధికారంలో ఉండి అనేక సాగునీటి ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.డిండి, గౌరవెల్లి, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించిన కీలక అనుమతులు, ప్రధాన పనులను గత ప్రభుత్వం పరిష్కరించలేకపోయిందన్నారు. డిండి ప్రాజెక్టుకు నీటి వనరును ఖరారు చేయడంలోనూ, ఆ నీటిని రిజర్వాయర్‌కు తరలించే కీలక ప్యాకేజీని పూర్తి చేయడంలోనూ ఏళ్ల తరబడి విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిండి ప్రాజెక్టు నీటి వనరును ఖరారు చేయడంతోపాటు, పనులను ముందుకు తీసుకెళ్లేందుకు సుమారు రూ.1,800 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అనేక ప్రధాన ప్రాజెక్టులకు అవసరమైన పర్యావరణ అనుమతులను సైతం గత ప్రభుత్వం సాధించలేకపోయిందన్నారు.

**కాళేశ్వరానికి ప్రజలను తీసుకెళ్లి ఏం చూపిస్తారు?**

కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీ జనసమీకరణకు కేసీఆర్ సిద్ధమవుతున్నారనే ప్రచారాన్ని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయి, ప్రాజెక్టు నిర్మాణ భద్రతే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో అక్కడికి ప్రజలను తీసుకెళ్లి ఏం చూపిస్తారని ప్రశ్నించారు."మీ ప్రభుత్వ హయాంలో రూపకల్పన చేసి, నిర్మించిన ప్రాజెక్టు దెబ్బతిన్న దృశ్యాలను చూపించడానికే ప్రజలను తీసుకెళ్తారా?" అని నిలదీశారు.ప్రతిపక్షాల రాజకీయ కార్యక్రమాలకు, పాదయాత్రలకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని స్పష్టం చేశారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో బీఆర్ఎస్ నాయకత్వం ముందుగా తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.నిపుణుల పరిశీలనల్లో కాళేశ్వరం బ్యారేజీల పునాదులు, నిర్మాణ వ్యవస్థలకు సంబంధించి తీవ్రమైన లోపాలు వెలుగుచూశాయని తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో డయాఫ్రం వాల్స్, స్టిల్లింగ్ బేసిన్ వ్యవస్థల మెరుగుదలతోపాటు దీర్ఘకాలిక భద్రతకు అవసరమైన పునరుద్ధరణ చర్యలను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు.

**బీఆర్ఎస్ తప్పిదాలను సరిదిద్దుతున్నాం**

గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై పడిందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. 2014లోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రాణహిత–చేవెళ్ల, జూరాల ఆధారిత పాలమూరు–రంగారెడ్డి పథకాలతోపాటు కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎస్ఎల్‌బీసీ, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను ఎంతో తక్కువ వ్యయంతో పూర్తి చేసి ఉండేవారమన్నారు.ప్రాజెక్టులను పదేపదే రీడిజైన్ చేస్తూ అంచనా వ్యయాలను పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం, అందుకు అనుగుణంగా సాగునీటి సామర్థ్యాన్ని మాత్రం సృష్టించలేకపోయిందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను మంత్రి ఉత్తమ్ తీవ్రంగా ఖండించారు. తాను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారినని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖకు ఎలాంటి నిపుణుల సేవలు అవసరమో మంత్రిగా తానే నిర్ణయిస్తానని పేర్కొన్నారు.మూడు జల సంవత్సరాల్లో కృష్ణా న్యాయవాటాను వినియోగించుకున్నాం తెలంగాణ నదీజల ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడుతోందన్న ప్రతిపక్ష ఆరోపణలను మంత్రి ఉత్తమ్ తోసిపుచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన మూడు జల సంవత్సరాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకున్నామని స్పష్టం చేశారు."తెలంగాణకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్న చిత్తశుద్ధితోనే పనిచేస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.కృష్ణా, గోదావరి నదీజలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా కోసం జల వివాదాల ట్రిబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సహా ప్రతి సమర్థ వేదికపైనా ప్రభుత్వం రాజీలేని పోరాటం కొనసాగిస్తోందన్నారు.కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ విచారణల కోసం తాను స్వయంగా న్యూఢిల్లీ వెళ్లి, న్యాయవాదులు, ఇంజినీర్లు, ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ వాదనను బలంగా వినిపించేలా చర్యలు తీసుకున్నానని తెలిపారు."కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడేందుకు గతంలో ఎన్నడూ లేనంత సమర్థంగా పోరాడుతున్నాం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోం" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.పదేళ్ల పాలనలో తాము ఏం చేశామో బీఆర్ఎస్ నాయకులు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. పంపులను ఎప్పుడు ప్రారంభించాలి, రిజర్వాయర్లను ఎలా నిర్వహించాలి, నీటిని ఎప్పుడు విడుదల చేయాలనే అంశాలపై ప్రస్తుత ప్రభుత్వానికి పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు."పంపులను ఎప్పుడు నడపాలో మాకు తెలుసు... నీటిని ఎప్పుడు పొదుపు చేయాలో తెలుసు... సాగునీటి వ్యవస్థను ఎలా నిర్వహించాలో కూడా తెలుసు. అందుకు అవసరమైన సామర్థ్యం, నిబద్ధత, నిజాయితీ మా ప్రభుత్వానికి ఉన్నాయి" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే వేసవిలో సాగునీరు, తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న జలాశయ నిల్వలను అత్యంత శాస్త్రీయంగా, జాగ్రత్తగా పరిరక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయడంతోపాటు కాళేశ్వరం బ్యారేజీలను నిపుణుల సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన చర్చల ప్రభావమే.. బీఆర్ఎస్ నేతల తాజా వ్యాఖ్యల్లో కనిపిస్తోంది

- **మంత్రి వివేక్ వెంకటస్వామి**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఇటీవల జరిగిన చర్చల ప్రభావమే బీఆర్ఎస్ నేతల తాజా వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తోందని శక్తి , గనుల శాఖ మంత్రి వివేక్ అన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను శాసనసభలో మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం పోలీసులు సంయమనంతో వ్యవహరిస్తున్నారని, వారికి అభినందనలు తెలిపారు. స్పీకర్ అసెంబ్లీని నిష్పక్షపాతంగా నడిపిస్తున్నారని, బీఆర్ఎస్ సభ్యులకు కూడా తగిన సమయం ఇచ్చారని తెలిపారు. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, తాతా మధును వెంటనే పిలిచి హౌస్ ముందు వివరణ తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో దళితుల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించకుండా కాళేశ్వరం కోసం భారీగా నిధులు ఖర్చు చేశారని అన్నారు. ప్రస్తుతం పోలీసులు సంయమనంతో వ్యవహరిస్తున్నారని, వారికి అభినందనలు తెలిపారు. దళితుల పట్ల కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదని ఆయన పాలన స్పష్టం చేసిందన్నారు. రాజయ్యను ఉపముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడం కూడా కేసీఆర్ నిర్ణయాల్లోని అస్థిరతకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పోలీసు వ్యవస్థను రాజకీయంగా ఉపయోగించుకుందని అన్నారు. ప్రస్తుతం పోలీసులు సంయమనంతో వ్యవహరిస్తున్నారని, వారికి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం పోలీసులు సంయమనంతో వ్యవహరిస్తున్నారని, వారికి అభినందనలు తెలిపారు. పోలీసులపై బీఆర్ఎస్ నేతలు దాడులు చేసి, తిరిగి



పోలీసు వ్యవస్థపైనే తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

# తాతా మధును ఏమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేసి, సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనుచిత ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7:** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఏమ్మెల్సీ తాతా మధు అనుచితంగా, అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ అన్నారు. శాసనసభ స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన తాతా మదుపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను ఏమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా, చట్టపరమైన మరియు రాజ్యాంగ బద్ధమైన నిబంధనల ప్రకారం ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాతా మధుచేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిపై చేసిన విమర్శలు కాదని, తెలంగాణ శాసనసభ వ్యవస్థపై, ప్రజాస్వామ్య విలువలపై, రాజ్యాంగబద్ధమైన పదవిపై చేసిన అవమానకర వ్యాఖ్యలని ప్రసన్నకుమార్ శర్మ పేర్కొన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన శాసన సభలో సభ్యులుగా ఉన్నవారు తమ మాటలు, ప్రవర్తన విషయంలో కనీస బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.“ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన శాసనసభను వ్యక్తిగత దూషణలకు, అసభ్య పదజాలానికి వేదికగా మార్చడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు” అని ఆయన అన్నారు. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని విమర్శించేందుకు ఎవరికి అభ్యంతరం లేదని, అయితే విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలకే పరిమితం కావాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, రాజ్యాంగబద్ధమైన పదవులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు.

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు భాషనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుసరిస్తున్నారు**

బీఆర్ఎస్ నాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ భాష, సంస్కృతి కారణంగానే ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ఎమ్మెల్యేలు కాంగ్రె స్ పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ, అనుచిత పదజాలాన్ని ఉపయోగిస్తున్నారని ప్రసన్న కుమార్ శర్మ ఆరోపించారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు వంటి నాయకులు ఏ విధంగా మాట్లాడుతున్నారో అదే భాషను ఆ పార్టీకి చెందిన ఇతర నాయకులు కూడా అనుసరిస్తున్నారని ఆయన విమర్శిం చారు. ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పీసీసీ అధ్యక్షులు, శాసన సభ స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలు చేయడం బీఆర్ఎస్ నేతలకు పరిపాటిగా మారిందన్నారు.రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, విమర్శకు మరియు వ్యక్తిగత దూషణకు మధ్య ఉన్న తేడాను బీఆర్ఎస్ నాయకులు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు.

**దళిత నాయకుడైన స్పీకర్‌ను అవమానించడం అత్యంత బాధాకరం**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దళిత నాయకుడిగా, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిగా రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో కొనసాగుతున్నారని ప్రసన్నకుమార్ శర్మ తెలిపారు. అలాంటి వ్యక్తిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన హామీలు, దళితుల పట్ల ఆ పార్టీ వ్యవహరించిన తీరును తెలంగాణ ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. దళితుల అభ్యున్నతి గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని విమర్శించారు.“దళితుడైన శాసనసభ స్పీకర్‌ను అవమానించే స్థాయికి రాజకీయ భాష దిగజారడం తెలంగాణ సమాజానికే అవమానం. ఇలాంటి ప్రవర్తనను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు” అని ప్రసన్న కుమార్ శర్మ స్పష్టం చేశారు.

**బహిరంగ క్షమాపణ చెప్పాలి**

తాతా మదు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ప్రసన్నకుమార్ శర్మ డిమాండ్ చేశారు.క్షమాపణ చెప్పడంతో సమస్య ముగిసిపోదని, శాసనమండలి సభ్యునిగా ఆయన వ్యవహరించిన తీరుపై స్పీకర్, శాసనసభ నియమ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



శాసనసభ గౌరవాన్ని కాపాడటానికి ఇలాంటి ఘటనలపై స్పష్టమైన, కఠినమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలి**

ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ పార్టీపై, కాంగ్రెస్ నాయకులపై చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ విమర్శల స్థాయిని దాటి వ్యక్తిగత దూషణల స్థాయికి చేరుతున్నాయని ప్రసన్న కుమార్ శర్మ అన్నారు.ప్రజల సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగం, రైతులు, విద్య, వైద్యం, సంక్షేమం వంటి అంశాలపై నిర్మాణాత్మక చర్చ చేయాల్సిన ప్రతిపక్షం వ్యక్తిగత విమర్శలు, అసభ్య పదజాలం, సభా మర్యాదలకు విరుద్ధమైన ప్రవర్తనకు పాల్పడటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా తమ రాజకీయ భాషను మార్చుకోవాలని, లేదంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని ప్రసన్నకుమార్ శర్మ హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ప్రభుత్వ పనితీరుపై విమర్శలు ఉంటే వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో, ఆధారాలతో చెప్పాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, అసభ్య వ్యాఖ్యలతో కాంగ్రెస్ నాయకులను కించపరచాలని ప్రయత్నిస్తే ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని స్పష్టం చేశారు.

**ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ**

తెలంగాణ శాసనసభ ప్రజాస్వామ్యానికి ప్రతీక అని, అక్కడ జరిగే ప్రతి చర్చ రాష్ట్ర ప్రజలకు ఆదర్శంగా ఉండాలని ప్రసన్న కుమార్ శర్మ అన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు తమ బాధ్యతను గుర్తించి సభా మర్యాదలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు.కాబట్టి తాతా మదు పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయన MLC పదవిని నుండి సస్పెండ్ చేసి, శాసనమండలి లో రద్దుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని ప్రసన్నకుమార్ శర్మ తెలిపారు.అదేవిధంగా, బీఆర్ఎస్‌కు చెందిన ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు కూడా భవిష్యత్తులో శాసనసభలోనూ, బయటా ప్రజా ప్రతినిధులకు తగిన గౌరవంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రజలు ప్రశాంతమైన, బాధ్యతాయుతమైన రాజకీయాలను కోరుకుంటున్నారని, ఆ దిశగా అన్ని రాజకీయ పార్టీలు వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

- స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా
- రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే
- తాతా మధుపై చర్యలు తీసుకోవాలి.. వెంటనే సస్పెండ్ చేయాలి
- తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7:**

తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. తాత మధు వ్యాఖ్యల పట్ల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసి సంఘీభావం ప్రకటించారు. తాత మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలిపారు.స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని మంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు.ఒక అట్టడుగు వర్గాల బిడ్డ, దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఉంటే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రాకుండా ఉంటారని, కానీ ఆయన పార్టీకి చెందిన నాయకులు మాత్రం బయటకు వచ్చి డ్రామాలు చేస్తుంటారని మంత్రి విమర్శించారు.స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి డిమాండ్ చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా మాట్లాడినా కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.శాసనసభ, స్పీకర్ పదవి పట్ల కనీస గౌరవం లేని విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మంత్రి అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# ఆయుష్ ఎకో- సిస్టమ్ ను బలోపేతంపై హైదరాబాద్ లో నీతీ ఆయోగ్ జాతీయ స్థాయి వర్క్ షాప్



**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7:**

దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆయుష్ ఎకో– సిస్టమ్ ను బలోపేతం చేయడానికి హైదరాబాద్ లోని కన్హా శాంతి వనంలో నీతీ ఆయోగ్ ఈనెల 8 వ తేదీన జాతీయ స్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఆయుష్ శాఖ డైరెక్టర్ ఐషా మస్రత్ ఖానం వెల్లడించారు. ఈ జాతీయ వర్క్ షాప్ కు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ కార్యదర్శి రాజేష్ కోతేచ, రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు లు హాజరవుతారని ఒక ప్రకటనలో తెలియచేసారు.

# కాంగ్రెస్ ప్రజా పాలనకు అండగా.. ప్రతిపక్షాల దుష్ప్రచారానికి చెక్!

- **టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ రెండో సంవత్సరం పూర్తి - కాంగ్రెస్ శ్రేణులకు కొత్త ఉత్సాహం: టీపీసీసీ ప్రధానకార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ గారు రెండో సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్ష లు తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు సాగుతుంటే, బీజేపీ–బీఆర్ఎస్ పార్టీలు వాస్తవాలను పక్కనపెట్టి తప్పుడు ప్రచారానికే పరిమితమయ్యాయని ఆయన విమర్శించారు.

**“ప్రజల తీర్పును గౌరవించలేకే బీజేపీ–బీఆర్ఎస్ దుష్ప్రచారం”**

“తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ప్రజా తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును జీర్ణించుకోలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు నిరంతరం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారు.. ఎవరు రాజకీయాల కోసం మాట్లాడుతున్నారు అనేది ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది.” అని టీపీసీసీ ప్రధానకార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ అన్నారు.

**“పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ప్రజలు ఇచ్చిన తీర్పు మర్చిపోవద్దు”**

“బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు తమ పదేళ్ల పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజ లు ఎందుకు బీఆర్ఎస్‌ను తిరస్కరించి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారో గుర్తు చేసుకోవాలి. గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం వల్ల ప్రజలు వాస్తవాలను మర్చిపోరు.” అని ఆయన అన్నారు.

**“కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసినదేమిటో చెప్పాలి”**

“బీజేపీ నేతలు తెలంగాణలో రాజకీయ విమర్శలు చేయడం కాదు.. కేంద్రంలో అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం తెలంగాణకు అందించిన నిధులు, కొత్త ప్రాజె క్టులు, ఉద్యోగాలు, పరిశ్రమలు, రాష్ట్ర హక్కుల విషయంలో చేసిన కృషిపై ప్రజలకు సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తెలంగాణ ప్రజలకు బీజేపీ నేతలు సమాధానం ఇవ్వాలి.” అని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.



**“సోషల్ మీడియా ప్రచారంతో ప్రజల సమస్యలు పరిష్కారం కావు”**

“బీజేపీ–బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారాలు ఎంత చేసినా ప్రజల సమ స్యలు పరిష్కారం కావు. కాంగ్రెస్ ప్రభు త్వం మాత్రం ప్రచార రాజకీయాలకు దూ రంగా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతోంది. పథకాలు, అభివృద్ధి కార్యక్ర మాల ఫలితాలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు.” అని తెలిపారు.

**“మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కార్యకర్తలకు అండ”**

“టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ గారు రెండో సంవత్సరం పూర్తి చేసుకోవడం కాంగ్రెస్ పార్టీకి గర్వకారణం. కార్యకర్తలను సమన్వయం చేస్తూ, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. అభివృద్ధి కార్యక్ర మాల ఫలితాలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు.” అని తెలిపారు.కార్యకర్తల కష్టాన్ని గుర్తించే నాయకత్వం పార్టీకి మరింత బలం ఇస్తుంది.” అని కొప్పుల ప్రవీణ్ కుమార్ అన్నారు.

**“రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు మరింత బలమైన ప్రజా మద్దతు”**

“బీజేపీ–బీఆర్ఎస్ ఎన్ని రాజకీయ కుట్రలు, దుష్ప్రచారాలు చేసినా కాంగ్రెస్ పార్టీని ప్రజల నుంచి దూరం చేయడం సాధ్యం కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తున్నంత కాలం ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుంది. మహేష్ కుమార్ గౌడ్ గారి నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తాం.” అని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ గారి ఆశయాలకు అనుగుణంగా,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.టీపీసీసీ అధ్యక్షుడిగా రెండో సంవత్సరం పూర్తి చేసుకున్న బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడాలని, ప్రజా సంక్షేమం–అభివృద్ధిలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని కొప్పుల ప్రవీణ్ కుమార్ ఆకాంక్షించారు.

# నవంబర్ 27ను బాల్య, బాల్యదశ, బలవంతపు వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి"



- **జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) ఆధ్వర్యంలోని ప్రపంచవ్యాప్త ఉద్యమానికి చారిత్రాత్మక ఐక్యరాజ్య సమితి గుర్తింపు.**

**హైదరాబాద్, తెలంగాణ వెలుతురు సెప్టెంబర్ 7 :**

బాలల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమానికి మరింత బలం చేకూర్చే విధంగా నవంబర్ 27ను " బాల్యదశ, బాల్యం, బలవంతపు వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవం"గా ప్రకటిస్తూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని "స్పం దన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) స్వాగతించింది.బాలల రక్షణ, వారి హక్కుల పరిరక్షణతో పాటు బాల్య వివాహాలు, దోపిడీ, హానికరమైన సామాజిక ఆచారాలను నిర్మూలించేందుకు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో ఈ నిర్ణ యం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని స్కోప్ సంస్థ పేర్కొంది.తెలంగాణలోని జనగాం, సంగారెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న స్కోప్ సంస్థ, భారతదేశవ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనకు, బాలల రక్షణకు కృషి చేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి), దాని భాగస్వామ్య సంస్థల నిరంతర కృషికి ఐక్యరాజ్యసమితి నిర్ణయం ఒక ముఖ్యమైన అంతర్జాతీయ గుర్తింపుగా అభివర్ణించింది. స్కోప్, జెఆర్సి భాగస్వామ్య సంస్థగా, బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ వ్యవస్థల బలోపేతం, విద్యను ప్రోత్సహించడం, బలహీ న వర్గాల కుటుంబాలకు సహాయం చేయడం వంటి అంశాల్లో నిరంతరంగా సమాజ ఆధారిత కార్యక్రమాలను అమలు చేస్తోంది.

### "భారతదేశం నుంచి వినిపించిన స్వరం — నేడు ప్రపంచ సంకల్పంగా మారింది"

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్కోప్ అధ్యక్షులు డా. బండి సాయన్న మాట్లాడుతూ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమంలో ఐక్యరాజ్యసమితి నిర్ణయం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని అన్నారు."భారతదేశం నుంచి వినిపించిన స్వరం నేడు ప్రపంచ సంకల్పంగా మారింది. మన సమిష్టి కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఎంతో గర్వకారణం. బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రత్యేకమైన అంతర్జాతీయ దినోత్సవంగా నవంబర్ 27ను ఐక్యరాజ్య సమితి ఎంపిక చేయడం భారతదేశానికి కూడా ఎంతో గర్వకారణం."నవంబర్ 27, 2024 భారతదేశానికి ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన రోజని డా. సాయన్న పేర్కొన్నారు. బాలల రక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల భాగస్వామ్యంతో భారత ప్రభుత్వం అదే రోజున "బాల వివాహ్ ముక్త్ భారత్" (బాల్య వివాహ రహిత భారత్) ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఐక్య రాజ్యసమితి తాజా నిర్ణయంతో ఈ తేదీకి ఇప్పుడు ప్రపంచవ్యాప్త ప్రాధాన్యత లభించిందని అన్నారు." అయితే ఇది సంబరాలు చేసుకుని ఆగిపోయే సమయం కాదు. అసలు సవాలు ఇప్పుడే ప్రారంభమవుతోంది—ప్రపంచ స్థాయిలో వ్యక్తమైన ఈ సంకల్పాన్ని గ్రామాలు, సమాజాలు, ప్రతి కుటుంబ స్థాయిలో కార్యాచరణగా మార్చాలి."

### మూడు తెలంగాణ జిల్లాల్లో 3,604 బాల్య వివాహాల నివారణ



బాల్య వివాహాల నివారణలో స్కోప్ సంస్థ క్షేత్రస్థాయి కార్యక్రమాలు గణనీయమైన ఫలితాలను సాధించాయని సంస్థ తెలిపింది.2023 నుంచి సెప్టెంబర్ 2026 వరకు జనగామ, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం 3,604 బాల్య వివాహాలను నివారించడంలో స్కోప్ సంస్థ కీలకంగా కృషి చేసింది.చట్టపరమైన జోక్యాలు, సమాజ సమీకరణ, అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ అధికారులతో సమన్వయం, బాలల రక్షణ వ్యవస్థల భాగస్వామ్యంతో ఈ బాల్య వివాహాలను నివారించినట్లు స్కోప్ సంస్థ తెలిపింది.2023 నుంచి నివారించిన 3,604 బాల్య వివాహాలు అంటే వేలాది మంది పిల్లలను చిన్న వయస్సులోనే వివాహ బంధంలోకి వెళ్లకుండా రక్షించి, వారు తమ విద్యను కొనసాగించేందుకు, సురక్షితంగా ఎదిగేందుకు, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు అవకాశం కల్పించినట్లేనని స్కోప్ పేర్కొంది. డా. బండి సాయన్న మాట్లాడు తూ..."ఒక గ్రామంలో ఒక్క బాలిక లేదా బాలుడు కూడా బాల్య వివాహం ముప్పులో ఉన్నం తకాలం మన పోరాటం పూర్తికాలేదు. 3,604 బాల్య వివాహాల ను నివారించామన్న సంఖ్య ఎంతో ముఖ్యమైనదే. కానీ ప్రతి సంఖ్య వెనుక ఒక బాల్యం, ఒక భవిష్యత్తు ఉంది. ఆ బాల్యం, భవిష్యత్తును మనం రక్షించాం. "చట్టాలు మాత్రమే బాల్య వివాహాల ను పూర్తిగా నిర్మూలించలేవని, నిరం తర ప్రజా భాగస్వామ్యం అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు."చట్టం ఒక ముఖ్యమైన సాధనం. అయితే నివారణకు అవగాహన, విద్య, సమాజ అప్రమత్తత, ఆర్థిక సహాయం, సకాలంలో జోక్యం అవసరం. అందుకే ప్రభుత్వ శాఖలు, పోలీస్, బాలల రక్షణ వ్యవస్థలతో సమన్వయం చేసుకుంటూనే, మేము నేరుగా సమాజాలు మరియు బలహీన కుటుంబాలతో కలిసి పనిచేస్తున్నాం."

### స్కోప్ క్షేత్రస్థాయి కార్యాచరణ విధానం

2023 నుంచి సెప్టెంబర్ 2026 వరకు మూడు జిల్లాల్లో బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ కోసం స్కోప్ పలు కార్యక్రమాలను బలోపేతం చేసింది. వాటిలో:

- **పాఠశాలలు, గ్రామాలు, గ్రామ పంచాయతీలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాల నిర్వహణ;**
- **బాల్య వివాహాల ముప్పు ఎదుర్కొంటున్న పిల్లలు, కుటుంబాలను గుర్తించడం;**
- **ప్రతిపాదిత, జరగబోయే బాల్య వివాహాలను నివారించేందుకు సమాజాలను సమీకరించడం;**
- **అత్యవసర జోక్యం అవసరమైన సందర్భాల్లో చట్టపరమైన చర్యలు, సకాలంలో సమాచారాన్ని అందించడం;**
- **బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞలు చేయడానికి పౌరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , సమాజ నాయకులను ప్రోత్సహించడం;**
- **ఆర్థికంగా బలహీన కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ, జీవనోపాధి పథకాలతో అనుసంధానం చేయడం;**
- **పాఠశాల నుంచి మధ్యలోనే బయటకు వచ్చిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు సహకరించడం;**
- **సమాజ ఆధారిత బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం;**
- **విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు సమాజ సభ్యుల్లో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం;**
- **సమర్థవంతమైన జోక్యాల కోసం ప్రభుత్వ అధికారులు, పోలీసులు, బాలల రక్షణ సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థలతో సమన్వయం చేయడం.**

బాల్య వివాహాల నివారణకు నివారణ, రక్షణ, విద్య, చట్టపరమైన జోక్యం, సామాజిక సమీకరణలను సమన్వయం చేసే బహుళ రంగాల విధానం అవసరమని స్కోప్ తన అనుభవం ద్వారా స్పష్టం చేసింది.

భారతదేశం నుంచి ఐక్యరాజ్యసమితి వరకుప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రత్యేకమైన అంతర్జాతీయ దినోత్సవాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్యమాన్ని ప్రారంభించి, నిరంతరం ముందుకు తీసుకెళ్లిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) వ్యవస్థాపకులు "భువన్ రిభు" నాయకత్వాన్ని స్కోప్ ప్రత్యేకంగా అభినందించింది.మార్చి 2026లో ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రసంగంలో భువన్ రిభు బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేకమైన యూ ఎన్ తీర్మానం తీసుకురావాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి సియెర్రా లియోన్ ప్రథమ మహిళ డా. ఫాతిమా మాడా బయో సహా పలువురు అంతర్జాతీయ నాయ కుల మద్దతు లభించింది.అనంతరం భారతదేశంతో సహా 67 దేశాల మద్దతుతో సియెర్రా లియోన్, ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమా వేశంలో నవంబర్ 27ను బాల్య, బాల్యదశ, బలవంతపు వివాహాల నిర్మూల నకు అంకి తమైన అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించేందుకు కృషికి నాయకత్వం వహిం చింది.సెప్టెంబర్ 4, 2026న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమా వేశం ఈ తీర్మానంపై చర్య తీసుకుంది. బాల్య, బాల్యదశ, బలవంతపు వివాహాలపై



ప్రపంచవ్యాప్త దృష్టి ని, కార్యాచరణను మరింత బలోపేతం చేసే దిశగా ఇది చారిత్రాత్మక పరిణామమని స్కోప్ పేర్కొంది.భారతదేశంలోని క్షేత్రస్థా యి వాస్తవాల నుంచి పుట్టిన ఒక ఉద్య మం, ప్రపం చవ్యాప్త సంకల్పంగా ఎలా రూపాంతరం చెం దిందో ఈ పరిణామం చాటిచెబుతోందని స్కోప్ తెలిపింది.

### జె ఆర్ సి దేశవ్యాప్త, ప్రపంచ బాలల రక్షణ ఉద్యమం

జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) బాల్య వివాహాలు, ఇతర రకాల బాలల దోపిడీని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సంస్థలు, పౌర సమాజ సంస్థలతో కలిసి పనిచేస్తున్న ప్రముఖ బాలల రక్షణ నెట్వర్క్.జె ఆర్ సి దాని భాగస్వామ్య సంస్థలు "చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ వరల్డ్" ప్రచారం ద్వారా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నాయి.భారతదేశంలో జె ఆర్ సి భాగస్వామ్య సంస్థలు 782 జిల్లాల్లో ప్రభుత్వాలు, జిల్లా పరిపాలనా యంత్రాంగాలతో కలిసి పనిచేస్తూ, బాలల రక్షణ కార్యక్రమాలను నేరుగా సమాజాలు, బలహీన వర్గాల ప్రజల వద్దకు తీసుకెళ్తున్నాయి.ఈ నెట్వర్క్ పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, గిరిజన, అణగారిన వర్గాలు, మహిళా సంఘాలు, పోలీసు సిబ్బంది, మత పెద్దలు మరియు ప్రజా ప్రతినిధులను సమీకరించి బాల్య వివాహాలను నివారించడంతో పాటు బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తోంది.జె ఆర్ సి ప్రకారం, భాగస్వామ్య సంస్థలతో కలిసి నిర్వహించిన సమిష్టి కృషి ద్వారా భారతదేశంలో 5.5 లక్షలకు పైగా బాల్య వివాహాల నివారణకు సహకారం అందించబడింది. లక్షలాది మంది ప్రజలు బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞల్లో పాల్గొన్నారు.

### భారతదేశంలో పురోగతి ఉన్నప్పటికీ సవాలు కొనసాగుతోంది

బాల్య వివాహాల ప్రాబల్యాన్ని తగ్గించడంలో భారతదేశం గణనీయమైన పురోగతి సాధించింది.తాజా నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-6 (ఎన్ ఎఫ్ హెచ్ ఎస్-6), 2023–24 ప్రకారం, 20–24 సంవత్సరాల వయస్సు గల మహిళల్లో 18 సంవత్సరాల లోపు వివాహం జరిగిన వారి శాతం 20.1%కి తగ్గింది. ఇది ★ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5 (2019–21)లో 23.3%గా ఉంది.ఈ తగ్గుదల ప్రోత్సాహకరమైన పరిణామమని స్కోప్ పేర్కొన్నప్పటికీ, బాల్య వివాహాలు ఇప్పటికీ కొనసాగుతుండటం వల్ల క్షేత్రస్థాయిలో నిరంతర చర్యలు అవసరమని తెలిపింది.జాతీయ స్థాయిలో సాధించిన పురోగతి ప్రతి గ్రామానికి, ప్రతి పాఠశాలకు, ప్రతి బలహీన కుటుంబానికి చేరుకోవాల్సిన అవసరం ఉందని సంస్థ స్పష్టం చేసింది. ముఖ్యంగా పేదరికం, పాఠశాల మానివేత, సామాజిక ఒత్తిళ్లు, అవగాహన లోపం కారణంగా పిల్లలు ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి అవసరమని పేర్కొంది.2030 నాటికి బాల్య వివాహాలను నిర్మూలించాలనే ప్రపంచ లక్ష్యం, సుస్థిర అభివృద్ధి లక్ష్యం (ఎస్ డి జి) 5లోని 5.3 లక్ష్యంతో అను



సంధానమై ఉంది. ఈ లక్ష్యం బాల్య, బాల్యదశ మరియు బలవంతపు వివాహాలతో సహా అన్ని రకాల హానికరమైన ఆచారాలను నిర్మూలించాలని పిలుపునిస్తుంది.

### "3,604 మంది పిల్లలు రక్షించబడ్డారు — కానీ మా లక్ష్యం కొనసాగుతుంది"

ఐక్యరాజ్యసమితి ప్రకటనను కేవలం ప్రతీకాత్మక విజయంగా కాకుండా, మరింత కార్యాచరణకు పునరుద్ధరించిన పిలుపుగా చూడాలని డా. బండి సాయన్న అన్నారు. "2023 నుంచి సెప్టెంబర్ 2026 వరకు 3,604 బాల్య వివాహాలను నివారించడం స్కోప్ కు ఒక ముఖ్యమైన విజయం. కానీ ఇది మా ప్రయాణానికి ముగింపు కాదు. మేము రక్షించిన ప్రతి బాలబాలిక ఒక భద్రపరిచిన భవిష్యత్తుకు ప్రతీక. జనగామ, సంగారెడ్డి లేదా యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఏ ఒక్క బాలబాలిక అయినా వారి బాల్యం, విద్య , కలలను కోల్పోయేలా బలవంతంగా వివాహం చేసుకునే పరిస్థితి రాకుండా చూడటం మా బాధ్యత."

**ఆయన ఇంకా మాట్లాడుతూ:**

"నవంబర్ 27 సామూహిక కార్యాచరణకు ఒక దినంగా మారాలి. ప్రభుత్వం, పౌర సమాజ సంస్థలు, పాఠశాలలు, పంచాయతీలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, సమాజ నాయకులు, ప్రతి పౌరుడు కలిసి పనిచేసి, బాల్య వివాహాలను అంగీకరించని, సహించని సమాజాన్ని నిర్మించాలి."బాలల రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి, తమ కార్యాచరణ జిల్లాలను బాల్య వివాహ రహిత జిల్లాలుగా మార్చే దిశగా ప్రభుత్వం, జిల్లా పరిపాలన, పోలీసు, ఇతర చట్ట అమలు సంస్థలు, పాఠశాలలు, పంచాయతీలు, సమాజాలు మరియు పౌర సమాజ సంస్థలతో కలిసి పనిచేయడానికి స్కోప్ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

### స్కోప్ ముఖ్య విజయాలు — ఒక చూపులో

3,604 బాల్య వివాహాలు నివారించడంలో కృషి కాల వ్యవధి: 2023 – సెప్టెంబర్ 2026

**జిల్లాలు: జనగామ | సంగారెడ్డి | యాదాద్రి భువనగిరి, తెలంగాణ**

**స్కోప్ సందేశం స్పష్టం:**

"ప్రతి బాలబాలికకు బాల్యాన్ని ఆస్వాదించే హక్కు ఉంది. విద్య, భద్రత, బాల్య వివాహాల నుంచి విముక్తమైన భవిష్యత్తు ప్రతి బిడ్డ హక్కు."



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత

తెలంగాణ రాష్ట్రంలో చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత నెలకొంది. అన్ని డిపార్ట్మెంట్స్ సంబంధించిన డాక్టర్లు లేరు ఉన్నా వారు సమయానికి అందుబాటులో ఉండరు. గడచిన వారం రోజుల క్రితం నల్గొండ జిల్లా కేంద్రంలోని గొల్లగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడ డాక్టర్ల కొరత నెలకొంది. ప్రసూతి కొరకు ఒక మహిళ హాస్పిటల్లో జాయిన్ కాగా సంబంధిత గైనకాలజిస్ట్ అందుబాటులో లేక సరైన సూచనలు సలహాలు అందక పూర్తిగా తెల్ల రక్త కణాలు పడిపోయి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుంది. నిరు పేదలు అతి సాధారణ మధ్యతరగతి ప్రజలు సరైన తిండికి బట్టకు నోచుకోని జనాలు పోషకాహార లోపం వల్ల ఇలాంటి సమస్యలను ఎదుర్కొని తట్టుకొని ఆసుపత్రిలో జాయిన్ అయితే అక్కడ పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ఒక గైనకాలజిస్ట్ మాత్రమే కాదు చాలామంది పేషెంట్స్ ప్రధానంగా సంప్రదించే గుండె సంబంధిత వైద్య నిపుణులు కార్డియాలజిస్ట్ డాక్టర్లు కూడా అందుబాటులో లేరు దీని మూలంగా ఉమ్మడి జిల్లా ప్రజలు అనేక అవస్థలు తీస్తున్నారు. ఈ మధ్యకాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయి గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లు అందుబాటులో లేక జిల్లా కేంద్రానికి వచ్చినా కూడా ఇక్కడ కూడా అదే పరిస్థితి ఉంది.నల్గొండ జిల్లా కేంద్రంలోని గొల్లగూడ ఆసుపత్రికి ప్రధానంగా ప్రసూతి కాన్పుల కొరకు చాలామంది మహిళలు ఉమ్మడి నల్గొండ జిల్లా నలుమూలల నుంచి, జిల్లా సరిహద్దు ప్రాంతాలైన మహబూబ్నగర్ ఖమ్మం జిల్లాల నుంచి కూడా ఈ ఆసుపత్రికి వస్తుంటారు కానీ వారికి సంబంధించిన గైనకాలజిస్ట్ డాక్టర్లు సమయానికి




అందుబాటులో ఉండరు. దీని మూలంగా ఈ ఆసుపత్రుని నమ్మి వచ్చిన చాలా మంది మహిళలు చెప్పలేని గోస తీస్తున్నారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రిలోకి పేద మధ్యతరగతి ప్రజలే అధికంగా వస్తారు అక్కడ డాక్టర్లు అందుబాటులో లేని మూలంగా డబ్బులు వెచ్చించి వేరే ఆసుపత్రికి వెళ్లలేరు అక్కడ ఉండి వైద్యం చేయించుకోలేరు ముందు పోతే నొయ్యి వెనుక పోతే గొయ్యి అన్న మాదిరి వీరి పరిస్థితి చాలా దీనావస్థలో ఉంది.ఈ కారణం చేత ప్రాణాలను అరిచేతిలో పట్టుకుని భగవంత నీవే దిక్కు అని గాలిలో దీపం లాగా ఆసుపత్రి ముందు నిద్రాహారాలు మా అని అనేకమంది పడిగాపులు కాస్తున్నారు. మానవ జీవితం ఎంతో ప్రత్యేకమైనది మనిషి జీవితం ఇంకా ఎంతో విలువైనది ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ అధికారులు దయచేసి పేదల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై రివ్యూ నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ జిల్లా నుండి రాజకీయ ఉద్దండులు దశాబ్దాల అనుభవం కలిగిన దురంధరులు ప్రభుత్వంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. వీరు సారథ్యంలో మన ఉమ్మడి జిల్లా మరింత ముందుకు సాగాలి ప్రజలకు ఎలాంటి లోటు తెలియకుండా ప్రజా పాలన ముందుకు సాగాలి. కనుక జిల్లా వైద్యశాఖ అధికారులు దయచేసి పేదల పక్షాన దయవుంచి జిల్లా మంత్రులు అధికారులు నెలకొకసారి రివ్యూ నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలు ఎలా నడుస్తున్నాయి ఎలా ముందుకు సాగుతున్నాయి అధికారుల పని తీరు ఎలా ఉందని ప్రతి నెల రివ్యూ నిర్వహించాలి. ప్రభుత్వ ఫలాలను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంచాలి. జిల్లా కలెక్టర్ మరియు డిఎంహెచ్ఓ అధికారుల ఆధ్వర్యంలో ప్రతి వారానికి ఒకసారి ప్రత్యేక రివ్యూ నిర్వహించి పరిస్థితులను సరి చేయాలి. వైద్యరంగంలో ఎక్కడైతే ప్రభుత్వ ఖాళీలు ఉన్నాయో వాటిని వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టాలి పేద మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నల్గొండ జిల్లా వాసిగా నా విజ్ఞప్తి..

**ఇట్లు**
**ఈద శేఖర్**
**-7036997589**

# రూపం తాత్కాలికం, రూపాయి చంచలం, మంచితనం శాశ్వతం

రూపాన్ని చూసి మోసపోకు బయటకు అందంగా కనిపించే ప్రతి మనసూ మంచిదై ఉండకపోవచ్చు. అలాగే సాధారణంగా కనిపించే వ్యక్తిలో ఎంతో గొప్ప వ్యక్తిత్వం, ప్రేమ, నిజాయితీ దాగి ఉండవచ్చు. అందుకే ఒకరి ముఖాన్ని, దుస్తులను, హోదాను చూసి వారి స్వభావాన్ని నిర్ణయించకూడదు.రూపం కంటికి కనిపిస్తుంది... గుణం మాత్రం కాలంతో తెలుస్తుంది. రూపాయిని చూసి మురిసిపోకు డబ్బు జీవిత అవసరాలను తీర్చగలదు. సౌకర్యాలను అందించగలదు. కానీ నిజమైన ప్రేమను, ప్రశాంతతను, నమ్మకాన్ని, ఆత్మీయతను కొనివ్వలేదు. సంపద ఉన్నప్పుడు మనచుట్టూ చేరేవారు చాలామంది ఉంటారు. కష్ట కాలంలో మన వెంట నిలిచేవారే నిజమైనవారు. డబ్బును చూసి వచ్చే గౌరవం, డబ్బు పోయినప్పుడు వెళ్లిపోతుంది.గుణాన్ని చూసి వచ్చే గౌరవం జీవితాంతం నిలిచిపోతుంది.రూపమైనా, రూపాయైనా శాశ్వతం కాదు వయస్సుతో రూపం మారుతుంది. కాలంతో సంపద చేతులు మారుతుంది. ఈరోజు ఉన్న హోదా రేపు ఉండకపోవచ్చు. ఆరోగ్యం, అందం, అధికారం, ఆస్తి—ఇవన్నీ కాలానికి లోబడినవే. అందువల్ల వాటి గురించి గర్వపడటం లేదా ఇతరులను తక్కువగా చూడటం సరైనది కాదు.

### మంచితనమే ఎందుకు శాశ్వతం?

మనం ఒకరికి చేసిన సహాయం, బాధలో పలికిన ఓదార్పు మాట, ఆకలితో ఉన్నవారికి పెట్టిన అన్నం,



కష్టంలో అందించిన చేయూత—ఇవే మనం వెళ్లిపోయిన తరువాత కూడా మన పేరును నిలబెడతాయి. మన రూపాన్ని కొంతకాలానికి ప్రజలు మరిచిపోవచ్చు.మన దగ్గర ఎంత డబ్బు ఉండేదో కూడా మరిచిపోవచ్చు.కానీ మనం వారిని ఎలా ఆదరించామో, ఎలా సహాయం చేశామో మాత్రం మరిచిపోలేరు. అందం ఉండటం తప్పు కాదు... సంపాదించడం కూడా తప్పు కాదు. కానీ రూపం వల్ల అహంకారం, రూపాయి వల్ల మానవత్వం కోల్పోవడం తప్పు. రూపానికి గుణం తోడైతే వ్యక్తిత్వం అందంగా మారుతుంది. రూపాయికి మంచితనం తోడైతే ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపవచ్చు.చివరికి మన వెంట వచ్చేది రూపం కాదు... రూపాయి కాదు...

**మనం చేసిన మంచి, సంపాదించిన ప్రేమ, నిలబెట్టుకున్న మానవత్వమే!**

**మీ నక్క యాదగిరి**

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- అసెంబ్లీకి వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

**కూకట్ పల్లి సెప్టెంబర్ 7 వెలుతురు:**

అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా కొండాపూర్ డివిజన్‌లోని మార్తాండ నగర్ ఇంపీరియల్ హోటల్ సమీపంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, బొబ్బ నవతారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు అసెంబ్లీలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే హక్కు ఉందన్నారు. అలాంటి ఎమ్మెల్యేలను సభకు వెళ్లకుండా అడ్డుకోవడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ ఎంపీలు గతంలో నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లి నిరసనలు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఒక న్యాయం, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు వెయ్యి రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలు కాలేదని వారు ఆరోపించారు. ఈ అంశాలపై ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే భయంతోనే వారిని సభలోకి రాకుండా అడ్డుకుని అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును వారు తీవ్రంగా ఖండించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పురుష పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఇది అత్యంత దురదృష్టకరమైన చర్య అని అన్నారు. "ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి.. అరెస్టులు చేసి గొంతు నొక్కడం పరిష్కారం కాదు" అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు,



నిరసన తెలిపే హక్కు, ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే హక్కులను ప్రభుత్వం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేసి, ఎలాంటి ఆటంకాలు లేకుండా వారు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను చైతన్యపరిచి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవియాదవ్, సంగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బాబు మియా, రోజా, మమత, శ్రీకాంత్, అల్లావుద్దీన్, సంతోష్, శివరాజ్, జుబేర్, ఖదీర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు గాలికి.. 22ఏ భూముల పేరుతో ప్రజలకు వేధింపులు..

- కాంగ్రెస్ పాలనపై కేపీహెచ్‌బీలో భారీ నిరసన ర్యాలీ.. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**కూకట్ పల్లి సెప్టెంబర్ 7 వెలుతురు :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనల మేరకు కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు ఆధ్వర్యంలో ఈ ఆందోళన నిర్వహించారు.కేపీహెచ్‌బీ డివిజన్‌లోని వసంత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజల ఆస్తులను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అదేవిధంగా ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను ప్రభుత్వం వేల కోట్ల రూపాయలకు విక్రయిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను వెయ్యి రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ నుంచి మూడో ఫేజ్‌లోని జయశంకర్ విగ్రహం వరకు 420 అడుగుల బాకీ కార్డుతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. గతంలో అమలులో ఉన్న సంక్షేమ పథకాలను సైతం రద్దు చేయడం లేదా నిర్వీర్యం చేయడం ద్వారా ప్రజలను



ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విధానాల కారణంగా అన్ని రంగాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు. 22ఏ భూముల సమస్యతో బాధపడుతున్న ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల తరపున నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, రాజేష్ రాయ్, సీనియర్ నాయకులు శ్యామల రాజు, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కే. పవన్ కుమార్, హరినాథ్, సురేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివారెడ్డి, కంచరపల్లి నాగరాజు, సుభాష్ గౌడ్, రమణ, రాంబాబు నాయుడు, కచిన్ టైలర్, వలవల నాయుడు, శ్రీనివాస రెడ్డి, తులసి రెడ్డి, పాతూరి గోపి, సాయి శ్రీనివాస్, రావెల్ షా, మోజేష్, దినేష్, రవిసింగ్‌తో పాటు మహిళా నాయకులు అనిత శ్రీపాద, అరుణ శెట్టి, లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, హేమ, సుబ్బలక్ష్మి, లక్ష్మి, ఉష, లలిత, స్వప్న, సావిత్రి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# "దళిత స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు!" తాతా మధుసూదన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- కూకట్‌పల్లి ఏసీపీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత చిరుమర్తి రాజు..

**కూకట్ పల్లి సెప్టెంబర్ 7 వెలుతురు:**

అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూకట్‌పల్లి ఏసీపీకి ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చిరుమర్తి రాజు మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఆయన వ్యాఖ్యలు యావత్ దళిత సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని ఆరోపించారు. తాతా మధుసూదన్ వెంటనే బేషరతుగా దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌ను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజా



ప్రతినిధిపై ఉందన్నారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలని, వ్యక్తిగతంగా లేదా సామాజిక వర్గాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని చిరుమర్తి రాజు హెచ్చరించారు. ప్రజా సమస్యల విషయంలో ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్వాల భాస్కర్, కచ్చిగాళ్ల రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై బీజేపీ లడాయి.. వడ్డేపల్లి రాజేశ్వరరావు హౌస్ అరెస్ట్

- అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిని అడ్డుకున్న కూకట్‌పల్లి పోలీసులు

**కూకట్ పల్లి సెప్టెంబర్ 7 వెలుతురు:**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన 'ఫీజుల బకాయి బీజేపీ లడాయి' కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు నియోజకవర్గ కార్యకర్తలతో కలిసి బయలుదేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును కూకట్‌పల్లి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఇంటి వద్దే ఆయనను నిర్బంధించి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని, బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజుల బకాయిలు పేరుకుపోవడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న



బీజేపీ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్ట్ చేయడం, అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థుల ఫీజు బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు బీజేపీ పోరాటం ఆగదని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని వడ్డేపల్లి రాజేశ్వరరావు స్పష్టం చేశారు.

# దళిత స్పీకర్‌ను అవమానిస్తే సహించేది లేదు

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం

**శంకర్ పల్లి, వెలుతురు సెప్టెంబర్ 7 :**

రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని మరిచి అసభ్య పదజాలంతో మాట్లాడటం బీఆర్ఎస్ నాయకుల అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే యావత్ దళిత సమాజాన్ని అవమానించడమేనని అన్నారు.తాతా మధుసూదన్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు, దళిత సమాజా నికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే బీఆర్ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని బొల్లారం వెంకట్ రెడ్డి హెచ్చరించారు.



# ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా గద్వాల విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం

- శుభాకాంక్షలు తెలిపిన ఆకుల నరేందర్ ముదిరాజ్..

**కూకట్ పల్లి సెప్టెంబర్ 7 వెలుతురు:**

తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా మాజీ హైదరాబాద్ మేయర్, తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ప్రగతి భవన్‌లో ఆమెను మేడ్చల్ జిల్లా ఫిషర్‌మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా రూపకల్పనలో ఆమె అనుభవంతో కీలక పాత్ర



పోషించాలని ఆకాంక్షించారు.విజయలక్ష్మి నాయకత్వంలో రాష్ట్ర ప్రణాళికా రంగం సమర్థవంతంగా ముందుకు సాగాలని, తెలంగాణ అభివృద్ధిలో ఆమె సేవలు మరింత విస్తృతంగా కొనసాగాలని నరేందర్ ముదిరాజ్ ఆకాంక్షించారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- శంకర్పల్లి ఇన్స్పెక్టర్ జి. రుద్వీర్ కుమార్
- మణి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**శంకర్పల్లి, వెలుతురు సెప్టెంబరు 07 :**

ఈ నెల 14వ తేదీన ప్రారంభం కానున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను నియోజకవర్గ వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శంకర్పల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. రుద్వీర్ కుమార్ పిలుపునిచ్చారు. రాబోయే గణేష్ చతుర్థి వేడుకలను పురస్కరించుకుని సోమవారం (ఈరోజు) శంకర్పల్లిలోని మణి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో వినాయక విగ్రహ నిర్వాహకులతో ఆయన ఒక ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రుద్వీర్ కుమార్ మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా ముందస్తు అనుమతులు (పర్మిషన్లు) తీసుకోవాలని సూచించారు. గణేష్ పండళ్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పక్కా క్రమశిక్షణ పాటించాలన్నారు. మండపాల ఏర్పాటు వల్ల సామాన్య ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపైనే ఉందన్నారు.

**భద్రత, నిబంధనలు ముఖ్యం**

మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు విద్యుత్ జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. అలాగే ధ్వని కాలుష్య నియంత్రణలో భాగంగా నిబంధనల మేరకే మైక్ సెట్లను ఉపయోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మత సామరస్యానికి భంగం కలిగించేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. నవరాత్రుల అనంతరం నిర్వహించే నిమజ్జన ఊరేగింపును కేవలం అధికారులు నిర్దేశించిన మార్గాల్లోనే, పూర్తి భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని స్పష్టం చేశారు.మండపాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం



అందించాలని కోరారు. ఉత్సవాలు శాంతియుతంగా, సురక్షితంగా ముగిసేందుకు ప్రజలు, నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ యోగేష్, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు మరియు శంకర్పల్లి పరిసర ప్రాంతాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అసైన్మెంట్ స్థలంలో దళితులకు హక్కు కల్పించాలి-కొమ్ము మంగమ్మ

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 07:**



బౌరంపేట్ లోని అసైన్మెంట్ స్థలం సర్వేనెంబర్ 472 లో దళితులకు హక్కులు కల్పించాలని బౌరంపేట మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె బౌరంపేట దళితులతో కలిసి దుండిగల్ గండి మైసమ్మ మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేనెంబర్ 472లో గత 75 సంవత్సరాలుగా దళితులు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఎలాంటి పునరావాసం కల్పించకుండానే 32 ఎకరాల స్థలాన్ని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా సుమారు 100 దళిత కుటుంబాలు జీవనోపాధికరువై ఇబ్బం దులకు గురవుతున్నారని ఆమె వివరించారు. రాష్ట్రంలో మిగతా వర్గాలకు ఒకరకంగా, దళితులకు మరోరకంగా ప్రభుత్వాలు వ్యవహరించడం సిగ్గుచేటైన విషయమని ఆమె విమర్శించారు. పక్కనే ఉన్న దుండిగల్లో అసైన్మెంట్ స్థలం తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నప్పుడు ప్రతి ఎకరా కు 700 గజాల అభివృద్ధి చేసిన ప్రభుత్వ స్థలాన్ని అసైనీలకు ఇస్తున్నారని అలాగే బౌరంపేట దళితులకు కూడా స్థలం కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నాకు దిగిన దళితులు తమకు న్యాయం చేయాలంటూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మండల తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి కి దళితులు వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వ భూమిని తిరిగి తీసుకునేటప్పుడు అంతవరకు ఆ భూమిపై ఆధారపడి వ్యవసాయం చేసిన కుటుంబాలకు న్యాయం చేయాలని తహసీల్దార్ ను అభ్యర్థించారు. ధర్నా కార్యక్రమంలో దళిత నేతలు దప్పు కృష్ణ, బాల గారి నరసింహ, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బాలగరి మల్లేష్, చింతకింది రాములమ్మ, అగ్రినరసింహ, పెద్ద సంఖ్యలో దళితులు ఈ ధర్నా కు హాజరయ్యారు.

# చిల్డ్రన్స్ పార్క్ ఏరియా అభివృద్ధికి ₹23.96 లక్షల CMC నిధులు మంజూరు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 07:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277 డివిజన్ మహాదేవపురం లోని దేవేందర్ నగర్ లేఅవుట్ ల్యాండ్స్ పరిధిలో చిల్డ్రన్స్ పార్క్ ఏరియా అభివృద్ధి కోసం ₹23.96 లక్షల CMC నిధులు మంజూరయ్యాయి.ఈ అభివృద్ధి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానికంగా పిల్లలకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా పార్క్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడం లక్ష్యంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, dcc సెక్రెటరీ ఎండీ లయక్, గణేష్, జగన్నాథ్, దేవేందర్ నాథ్ (2BHK), శ్రీనివాస్ ప్రసాద్, ప్రభాకర్, సంగమేశ్, యాదగిరి, విజయ్, నాగరాజు, సత్యనారాయణ, రాజేష్, షాహెద్, సాజిద్, బ్రహ్మచారీ, శ్రీనివాస్ (వార్డ్



మెంబెర్), జహంగీర్, మైనారిటీ నాయకులు అఫ్జల్ భాయ్, అంజలి, కౌసల్య , పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీజేపీ, BJYM నాయకుల ముందస్తు అరెస్టుపై ఖండన
- విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయలి.
- విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**గుండాల, సెప్టెంబర్ 7 (వెలుతురు):**

విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీజేపీ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన గుండాల మండల బీజేపీ, BJYM నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు.విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి నాయకులు సిద్ధమయ్యారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేసేందుకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అడ్డుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు.విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను సకాలంలో విడుదల చేయకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన బీజేపీ, BJYM నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని నాయకులు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ సమస్యలను, డిమాండ్లను శాంతియుతంగా వ్యక్తం చేసే హక్కు ఉందని, అలాంటి హక్కులను అడ్డుకోవడం సరికాదని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా, వారి చదువులకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న బీజేపీ, BJYM నాయకులను ముందస్తు అరెస్టులతో అడ్డుకున్నప్పటికీ విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం తమ పోరాటం ఆగదని నాయకులు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి బీజేవైఎం నాయకులు వివాకర్ రెడ్డి మండల వైస్ ప్రెసిడెంట్ వెంపటి సురేష్ బీజేవైఎం నాయకులు సింగారం సోమరాజు గుండాల బూత్ అధ్యక్షులు సతీష్పాటు బీజేపీ, BJYM నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విప్లవ యోధుడు రావి నారాయణరెడ్డి




**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 07:**

తెలంగాణ సాయుధ పోరాటంలో, భారత స్వతంత్ర ఉద్యమంలో విప్లవ యోధులు రావినారాయణరెడ్డి చేసిన పోరాటం అజరమరమని సిపిఐ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి అన్నారు. రావినారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా చౌటుప్పల్ సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం నివాళులర్పించారు, ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ, నైజాం నిరంకుశ పాలనలో నలిగి పోతున్న తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రమహాసభ ను స్థాపించి సబ్బండ వర్గాల ప్రజల్ని ఏకం చేసి నిజాం తరిమికొట్టి, లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర రావినారాయణరెడ్డిదని. 1952 జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో నెహ్రూ కంటే అత్యధిక ఓట్ల మెజార్టీ రావడంతో పార్లమెంట్ భవనాన్ని రావినారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఎంపీ గా, సాయుధ పోరాట యోధుడిగా ఆయన పోరాటాన్ని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా తీసుకుంటాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి ఉడుత రామలింగం, కొండూరు వెంకటేష్, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, దాసరి కృష్ణ, ఉబ్బు దర్శన్, దాసరి యాదయ్య, గుండబోయిన భాస్కర్, దాసరి మనోహర్ పాల్గొన్నారు

# లింగాకర్షణ బుట్టలతో గులాబీ పురుగుకు చెక్

- రైతులకు అవగాహన సదస్సు
- బీసీఐ రైతులకు ఉచితంగా లింగాకర్షణ బుట్టల పంపిణీ

**గుండాల సెప్టెంబర్ 7 (వెలుతురు):**



పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు నివారణలో లింగాకర్షణ బుట్టలు కీలకంగా పని చేస్తాయని ఎల్‌డీసీ ప్రతినిధి అఖిలేష్ తెలిపారు. పెద్దపడిశాల గ్రామంలో లూయిస్ డ్రెఫస్ కంపెనీ ఆధ్వర్యంలో మోడర్న్ ఆర్కిటెక్స్ ఫర్ రూరల్ ఇండియా సంస్థల సహకారంతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలేష్ మాట్లాడుతూ.. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతిని ముందుగానే గుర్తించి, పంట నష్టాన్ని తగ్గించేందుకు లింగాకర్షణ బుట్టలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రైతులు ఎకరానికి 6 నుంచి 10 లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీటి వినియోగం ద్వారా పురుగు ఉధృతిని గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని వివరించారు.సమగ్ర సస్యరక్షణపై అవగాహన సదస్సులో నిపుణులు పత్తి పంటలో తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన శాస్త్రీయ పద్ధతులు, ముందస్తు జాగ్రత్తలు, సమర్థవంతమైన నియంత్రణ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటను కాపాడుకోవడంలో సకాలంలో తీసుకునే చర్యలు ఎంతో ముఖ్యమని తెలిపారు. సమగ్ర సస్యరక్షణ విధానాలను పాటించడం ద్వారా పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచించారు. పత్తిలో అధిక దిగుబడులు సాధించేందుకు రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గులాబీ రంగు పురుగు పత్తి రైతులకు ప్రధాన సమస్యగా మారుతున్న నేపథ్యంలో లింగాకర్షణ బుట్టలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు.

**ఉచితంగా బుట్టల పంపిణీ**

కార్యక్రమంలో ఎల్‌డీసీ సంస్థ ఆధ్వర్యంలో బీసీఐ రైతులకు లింగాకర్షణ బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. రైతులు వీటిని పత్తి పొలాల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని గులాబీ రంగు పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో కే. నవనీత, పీయూ మేనేజర్ వంశీ, ఉపసర్పంచ్ మట్టగజ్జ మల్లేష్, వార్డు సభ్యులు ఎర్ర ఎల్లేష్, పీయూ కోఆర్డినేటర్ పేరపు నరేష్, మారి సంస్థ సిబ్బంది పాలడుగు మహేష్, గుగులోతు తిరుపతి, ధరావత్ గణేష్, కాలి అనిల్ కుమార్, బుంగ శిరీష, పెండల సంధ్య, గనుపాక ప్రశాంత్, కట్కూరి పాండు, వస్పరి స్రవంతి, బొర్ర పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.




# ఎన్నికల హామీలను అమలు చేయాలి

**మందుల సత్యం**

**మునుగోడు, సెప్టెంబర్ 7 (వెలుతురు):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మందుల సత్యం డిమాండ్ చేశారు. ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ సోమవారం మునుగోడు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు.ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డికి విజ్ఞాపన పత్రం అందజేశారు. హామీలను విస్మరించి ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని సత్యం విమర్శించారు. మునుగోడు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అసెంబ్లీ ఘటనను నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.ఈ కార్యక్రమంలో మాదనబోయిన పరమేష్,పగిళ్ల సతీష్, పూల వెంకటేశం, సర్పంచులు నన్నూరి భూపతిరెడ్డి,నకిరే కంటి మురళీకృష్ణ,ఈద శరత్ బాబు,జంగిలి సాంబయ్య,నల్గొండ అంజి,వరంగంటి శంకర్, యడవెల్లి సురేష్,బోయపర్తి సురేందర్,దోటి కరుణాకర్,ఐతగోని విజయ్,బండారు శ్రీనివాస్, ఉప్పునూతల శ్రీశైలం, బోయపర్తి సైదులు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాల సందర్భంగా

# పోలీస్ అనుమతులు ఆన్‌లైన్‌లో పొందాలి

**చౌటుప్పల్ వెలుతురు సెప్టెంబర్ 07:**

గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్ అనుమతులను ప్రజలు తెలంగాణ స్టేట్ పోలీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందాలని చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ G. మన్మథ కుమార్ సూచించారు.గణేష్ ఉత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అందులో మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత పోలీస్ అధికారులు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతి జారీ చేస్తారని పేర్కొన్నారు. QR/డిజిటల్ NOC ద్వారా అనుమతి పొందే అవకాశం ఉందన్నారు.అదే విధంగా గణేష్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయడం, విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించడం, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం, శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతతో నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ కోరారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం 100 / 112కు కాల్ చేయాలని సూచించారు.




# ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలి – ఎమ్మెల్సీ పదవి నుంచి తాతా మధును బర్తరఫ్ చేయాలని డిమాండ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) సెప్టెంబర్ 7:**

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ఒక శాసనమండలి సభ్యుడు, దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రం గా అభ్యంతరకరమని శ్రీశైలం గౌడ్ పేర్కొన్నా రు. శాసనసభాపతి పదవి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవాన్ని, హుందాతనాన్ని పాటించా ల్సిన అవసరం ఉందన్నారు.రాజ్యాంగబద్ధమైన పదవు ల్లో ఉన్న వ్యక్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉండగా, తాతా మధు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని స్పష్టం చేశారు.తాతా మధుపై తక్షణమే తగిన చర్యలు తీసుకుని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయా లని కూన శ్రీశైలం గౌడ్ డిమాండ్ చేశారు. అదేవిధంగా శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు తాతా మధు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థల గౌరవాన్ని, రాజ్యాంగ పదవుల ప్రతిష్ఠను కాపాడేందుకు ఇలాంటి వ్యాఖ్యలపై సంబంధిత అధికారులు, శాసనసభ మరియు శాసనమండలి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీశైలం గౌడ్ విజ్ఞప్తి చేశారు.



# అక్రమ అరెస్టులతో బిఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు, ప్రభుత్వం వ్యవహరించిన తీరు సిగ్గు చేటు

- బిఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధుల పార్టీ అక్రమ అరెస్ట్ కు నిరసనగా కుత్బుల్లాపూర్ లో పెల్లుబిక్కిన ఆగ్రహ జ్వాలలు

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి సెప్టెంబర్ 07:**

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు నల్ల టీ–షర్టులతో హాజరైన బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం పట్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల, చింతల్, గాజుల రామారం, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ సర్కిల్ కార్యాలయాల వద్ద బిఆర్‌ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల దగాపాలనపై అసెంబ్లీ వేదికగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు వెళ్తున్న బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు సరైంది కాదని, రాజ్యాంగబద్ధంగా ఉన్న ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు, అభిమానులు పాల్గొన్నారు.





# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు అమానుషం

**మునుగోడు, సెప్టెంబర్ 7 (వెలుతురు ):**

అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి ఖండించారు.ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించడం, సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకోవడం దారుణమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులని చూడకుండా పోలీసులు కర్కశంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం హరించకూడదని, ఘటనకు బాధ్యులైన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




# రావి నారాయణరెడ్డి గారి 35వ వర్ధంతి

- సిపిఐ ఘన నివాళి

**రామన్నపేట వెలుతురు సెప్టెంబర్ 07:**

భారతదేశమంతా స్వాతంత్రం వచ్చిన హైదరాబాద్ సంస్థానాన్ని పాలిస్తున్న నిజాం ను ఎదిరించడానికి గొరిల్లా యుద్ధమే చేయాల్సిన పరిస్థితి కమ్యూనిస్టులకు వచ్చిందని దానికి నాయకులుగా రావినారాయణ రెడ్డి గారు ముందుండి కత్తులు, గొడ్డల్లు, పారలు, చేతికి దొరికిన ఆయుధాలతో నిజాం సర్కారు పై, రజాకారులపై దండెత్తి తెలంగాణ విమోచనం కలిగించారని , 1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో నల్లగొండ ఎంపీ గా నెహ్రూ కంటే ఎక్కువ మెజార్టీతో గెలిచిన రావి నారాయణ రెడ్డి గారి తో పార్లమెంటు ఓపెనింగ్ చేయించారని, నేడు కొందరు ఆయన చరిత్రను , కమ్యూనిస్టుల తాగాలను మరుగున పరిచేందుకు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని, చరిత్ర ఎప్పటికీ నిజాలే చెప్తుందని గుర్తుంచుకోవాలని తెలియజేశారు... ఈ సందర్భంగా రావినారాయణ రెడ్డి గారి 35వ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు... నివాళులు అర్పించిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయుసి మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సిపిఐ సీనియర్ నాయకులు గంగాపురం యాదయ్య, ఊట్కూరు శీను, ఎర్ర కిరణ్ కుమార్ గౌడ్, ఊట్కూరు కృష్ణ, పల్లె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శివ స్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

- 27వ సోమవారం అన్నదాన ప్రభువు సిద్దగోని రమేష్ గౌడ్

**మంచాల వెలుతురు సెప్టెంబర్ 07:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి సోమ వారం గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం27వ సోమవారం అన్నదాన ప్రభువు సిద్ధగోని రమేష్ గౌడ్ ముందుగా కూతురు సుప్రజాలక్ష్మి జన్మదినం సందర్భంగా ముందుగా కంఠమహేశ్వ ర దేవాలయంలో కంఠమహేశ్వరస్వామికి శివలింగానికి రమేష్ గౌడ్ దంపతులు కుటుంబసభ్యు లు గౌడ సంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ ఉపాధ్యక్షుడు సుంకరి ప్రవీణ్ గౌడ్ మా దుగుల కృష్ణగౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ అంతటి రాజుగౌడ్ వైయ స్సార్ మాధగోని జంగ య్యగౌడ్ తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం భక్తులకు అన్న దాన కార్యక్రమం ప్రారంభించారు ఈకార్యక్రమంలో ప్రజాసం ఘాల నాయకుడు కంబాలపల్లి భా స్కర్ డాక్టర్ నేరెళ్ల శంకర్ అయ్యప్ప స్వాముల గురుస్వామి లొంగరి దాసు సుంకరి జంగయ్య గౌ డ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ పాశం బాలరాజు గౌడ్ కాసుల జంగయ్య కొత్తపల్లి నరసింహగౌడ్ మంద పాకుల శ్రీనివాస్ తవిటి నరసింహ ముదిరాజ్ తదితరులుపాల్గొన్నా రు



# హైదరాబాద్‌లో ఉద్రిక్తత అసెంబ్లీ ముట్టడికి యత్నించిన కరీంనగర్ జిల్లా బిజెపి నేతలు..



- **కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అరెస్ట్**

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 07:**

రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ "ఫీజు బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం రోజున హైదరాబాదులో ఉండ తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ ముట్టడి కోసం కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేష్ ఆధ్వర్యంలో తరలి వెళ్లిన బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తో పాటు మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివా సరావు, కరివేద మహిపాల్ రెడ్డి , పుప్పాల రఘు , బల్బీర్ సింగ్, అడిచెర్ల రాజు , యువర్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సంఘ నరేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్, మండల అధ్యక్షులు రాజిరెడ్డి, అనిల్ , చింతం శ్రీనివాస్, హరీష్ , దళిత మూర్ఛ నాయకులు అనిల్ లతో పాటు పలువురు ముఖ్య నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

### ప్రభుత్వ నిరంకుశత్వానికి ఈ అరెస్టులే నిదర్శనం

బీజేపీ నేతల అక్రమ అరెస్టులపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అణచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సుమారు ₹15,000 కోట్ల ఫీజు



రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం వల్ల లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రభుత్వానికి బకాయలు చెల్లించే ఉద్దేశం ఉందా లేదా అని వారు ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తుందని, విద్యార్థుల బకాయిలన్నీ పూర్తిగా చెల్లించే వరకు తాము వెనకడుగు వేసే ప్రసక్తి లేదని , బీజేపీ లడాయి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

### కరీంనగర్లో అసెంబ్లీ కో కన్వీనర్ గుర్రం వెంకటేష్ గౌడ్ అరెస్ట్

చలో అసెంబ్లీ కార్యక్రమానికి హైదరాబాద్ తరలి వెళుతున్న ఫీజుల బకాయి.. బిజెపి లడాయి కరీంనగర్ అసెంబ్లీ కో కన్వీనర్ గుర్రం వెంకటేష్ గౌడ్ ను కరీంనగర్ పోలీసులు అరెస్టు చేసి , స్టేషన్ కు తరలించారు . ఈ సందర్భంగా గుర్రం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రశ్నించే గొంతుకులను అణిచివేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. విద్యార్థులకు న్యాయంగా ఇవ్వాల్సిన ఫీజు బకాయిలు చెల్లించకుండా, కాంగ్రెస్ సర్కార్ దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. శాంతియుత పద్ధతిలో నిరసన తెలియజేసేందుకు బిజెపి చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడితే పోలీసులు అక్రమంగా అరెస్టు అరెస్టు చేయించడం ప్రభుత్వానికి తగదన్నారు.



# ఆరెపల్లిలో రూ.10 లక్షల ఎంజీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- **పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత.. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 07:**

నగరంలోని అన్ని డివిజన్లలో సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గం ముందుకు సాగుతోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు

### నగర పరిధిలోని ఒకటవ డివిజన్

ఆరెపల్లిలో మున్సిపల్ సాధారణ నిధులు (MGF) రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి అందుబాటులో ఉన్న మున్సిపల్ సాధారణ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఆరెపల్లిలో నిర్మించనున్న సీసీ రోడ్డు



వల్ల స్థానిక ప్రజలు, వాహనదారులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని తెలిపారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత మున్సిపల్ అధికారులను, కాంట్రాక్టర్‌ను మేయర్ ఆదేశించారు. పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలకు తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.నగర అభివృద్ధికి చేస్తున్న కృషికి స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్, మున్సిపల్ అధికారులు, కాలనీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా చేసిన మహిళకే అవమానమా !

- **బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కౌడిపల్లి లో రాస్తారోకో**

**కౌడిపల్లి సెప్టెంబర్ 7(వెలుతురు) :**

అసెంబ్లీ సాక్షిగా నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిట సునీత లక్ష్మారెడ్డికి జరిగిన అవమానానికి నిరసనగా కౌడిపల్లి మండల కేంద్రంలో మండల బి ఆర్ ఎస్ అధ్యక్షుడు సారా రామా గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి 765 పైన బి ఆర్ స్ శ్రేణులు పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ తీస్తూ రాస్తారోకో చేశారు. రామా గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా, మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా చేసిన మహిళకే అసెంబ్లీ సాక్షిగా అవమానమా అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇకనైనా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను గౌరవించడం నేర్చుకోవాలి అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దుర్గా రెడ్డి, మహిపాల్ రెడ్డి , సర్పంచులు రవి యాదవ్, శివానందరెడ్డి, కోల శ్రీనివాస్, బాలకృష్ణ, కుమార్, నాయకులు రవి సాగర్ ,గోపాల్ , రమేష్ నాయక్ ,పోచయ్య , యువ నాయకులు సందీప్ కుమార్



,యాదుల్లా, మహబూబ్ ,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# 70వ SGF కరీంనగర్ అర్బన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

- **క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి – నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 07:**

మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ SGF కరీంనగర్ అర్బన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ – 2026–27 పోటీలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీలకు కరీంనగర్ అర్బన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు మరింత ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు.కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలకు విద్యార్థుల్లో మంచి




ఆదరణ ఉందని, పోటీల్లో పాల్గొనడం ద్వారా గెలుపోటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందని మేయర్ తెలిపారు. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని కరీంనగర్ నగరానికి, తమ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల చైర్మన్ కె. అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతా రెడ్డి,గసిరెడ్డి జనార్దన్ రెడ్డి , అంతటి శంకరయ్య,తుమ్మల రమేష్, బన్సిలాల్ ,మల్లేష్ గౌడ్,వేణుగోపాల్,దారం గౌతమ్ రెడ్డి, కంకటి అనూప్ కుమార్ , క్రీడా నిర్వాహకులు, వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు పాల్గొన్నారు.



# మహాధర్నాకు వెళ్లకుండా బీజేపీ నేతల హౌస్ అరెస్ట్

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి....**
- **బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్....**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థి మహాధర్నాకు వెళ్ల కుండా బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం వారిని చరగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక విద్యార్థులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు.ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని



డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.హౌస్ అరెస్ట్ అయిన వారిలో జగన్నాథ్ హిందూస్, సురేష్, ప్రతాప్‌రెడ్డి, నరేష్, నాగేష్ ఉన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అస్మా బేగంకు జిల్లా స్థాయి అవార్డు

- **ప్రతిభా అవార్డు, గోల్డ్ మెడల్ సాధించిన అస్మా బేగం....**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

సంగారెడ్డి జిల్లాలో 2026 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అస్మా బేగం అవార్డు అందుకున్నారు. విద్యారంగంలో ఆమె అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం ప్రదానం చేశారు.అస్మా బేగం గతంలో ప్రతిభా అవార్డును గోల్డ్ మెడల్‌తో అందుకున్నారు. అలాగే జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గోల్డ్ మెడలిస్ట్‌గా నిలిచారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యారంగంలో ప్రతిభ కనబరుస్తూ పలు పురస్కారాలు అందుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. అస్మా బేగం జహీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జుబేర్ హెచ్‌బీకి అక్క. ఆమెకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు లభించడం పట్ల కుటుంబ



సభ్యులు, బంధువులు, స్నేహితులు, పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



# నూతన గృహ ప్రవేశంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 07 :**

సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డ్రైవర్ అశోక్ మరియు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ డ్రైవర్ యాదగిరి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో టి యు డబ్ల్యు జే (హెచ్ –143) నారాయణఖేడ్ జర్నలిస్టుల అధ్యక్షుడు అమృతం,మహాన్యూస్ రిపోర్టర్ ఎం.డి. మజహర్ ఖాన్ చిస్తీ,బిగ్ టీవీ రిపోర్టర్ సయ్యద్ అలీ,వారితో పాటు మిత్రులు యూసుఫ్,షరీఫ్,తోసిఫ్,సంతోష్, సునీల్, తదితరులు పాల్గొని అశోక్,యాదగిరి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.నూతన గృహంలో సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

# అంబేద్కర్ సాక్షిగా మహిళా లోకం ఆవేదన



- **నల్ల కండువాలతో నిరసన.. ప్రభుత్వ తీరుపై మహిళా ప్రజాప్రతినిధుల ఆగ్రహం...**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

తెలంగాణలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన అవమానాలు, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ జహీరాబాద్‌లో మహిళా ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు వినూత్న నిరసన చేపట్టారు. నల్ల కండువాలు ధరించి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, ఆయనకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విలువల ను విస్మరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుం డా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.ఎన్నికల హామీల అమలుపై అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన సీనియర్ మహిళా ప్రజాప్రతినిధులు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా నాయకురాళ్ల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా వ్యవహరించడం బాధాకరమన్నారు. అత్యున్నత చట్టసభలోనే మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.నల్ల కండువాలతో నిరసన తెలిపిన మహిళలు.. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేలా సద్బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహం ఎదుట వేడుకున్నారు.కార్యక్రమంలో నామ స్రవంతి రవికిరణ్, పర్వీన్ బేగం అబ్దుల్లా, పర్వీన్ జహీర్ యాకూబ్, మజ్జిగ సుజిత విశ్వేశ్వర్, అన్నపూర్ణ అశోక్ షెరి, స్వప్న ప్రవీణ్, విమల రాజు, పెద్దబాయి మైపాల్, గౌసుద్దీన్ గౌరీ, జాకీర్, దీపక్ పాల్గొన్నారు.

# అరెస్టులతో బీజేపీ ఉద్యమాన్ని ఆపలేరు



- **ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై దాడి...**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి శాంతియుతంగా వెళ్తున్న బీజేపీ నాయకులను జహీరాబాద్ పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు.చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, సురేష్ పూరీలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.అరెస్టులు, నిర్బంధాలు, పోలీసుల ఆంక్షలతో బీజేపీ నాయకులను భయపెట్టడం సాధ్యం కాదన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించినందుకు అరెస్ట్ చేస్తారా? ప్రజల గొంతుకగా నిలిచినందుకు నిర్బంధిస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రజా సమస్యలపై బీజేపీ ఎప్పటికీ రాజీపడబోదని, ప్రజల హక్కుల కోసం మరింత ఉధృతంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# ఐదు కేసులు ఛేదించిన జగద్గిరిగుట్ట పోలీసులు

- **నిందితుల అరెస్ట్ – 3.5 తులాల బంగారం మరియు రూ.10 లక్షల విలువైన బ్యాటరీల రికవరీ**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వివిధ నేరాలకు సంబంధించి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, కేవలం రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించారు. కేసులకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన సొత్తు, మోసం ద్వారా తీసుకున్న నగదు మరియు బంగారాన్ని రికవరీ చేశారు.

### 1. మోసం కేసులో నిందితుడి అరెస్ట్ – రూ.9 లక్షల నగదు, 3.5 తులాల బంగారం మోసం

మోసం మరియు ఐటీ యాక్ట్‌కు సంబంధించిన కేసులో ఫిర్యాదు అందడంతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు కామినెడ్డి శివమోహన్ రెడ్డి, అక్కపల్లి గ్రామం, మార్కాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.దర్యాప్తులో నిందితుడు గతంలో సుమారు 12 సంవత్సరాల పాటు ★SSB (Sashastra Seema Bal)★లో కానిస్టేబుల్‌గా పనిచేసినట్లు, అనంతరం విధి నిర్వహణలో అనుచిత ప్రవర్తనతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడటంతో సర్వీసు నుండి తొలగించబడినట్లు గుర్తించారు.సర్వీసు నుండి తొలగించబడిన అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి, వివిధ వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుని వారి నమ్మకాన్ని సంపాదించి డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా ఇలాంటి మోసం కేసుల్లో జైలుకు వెళ్లినట్లు గుర్తించారు.ప్రస్తుత కేసులో బాధితురాలితో ఫోన్ ద్వారా పరిచయం ఏర్పరచుకుని, కొంతకాలం పాటు సన్నిహితంగా ఉంటూ ఆమె నమ్మకాన్ని సంపాదించాడు. అనంతరం తనకు, తన కుటుంబ సభ్యులకు వివిధ అవసరాలు ఉన్నాయని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తదితర కారణాలు చెబుతూ బాధితురాలిని నమ్మించి, వివిధ సందర్భాల్లో సుమారు రూ.9,00,000/- నగదు తీసుకుని మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది.అదేవిధంగా సుమారు 3.5 తులాల బంగారం కూడా తీసుకుని, దానిని కంభం కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు గుర్తించారు.నిందితుడిపై గతంలో కూడా మార్కాపురం, గిద్దలూరు ప్రాంతంలోని పోలీస్ స్టేషన్లలో ఇలాంటి మోసాలకు సంబంధించి కేసులు నమోదైనట్లు గుర్తించారు.నిందితుడిని అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

### 2. అస్బెస్టాస్ కాలనీలో వరుస ఇళ్ల దొంగతనాలు – నిందితుడి అరెస్ట్, చోరీ సొత్తు రికవరీ

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని అస్బెస్టాస్ కాలనీలో గత 15 రోజులుగా రాత్రి వేళల్లో వరుస ఇళ్ల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు గరికపాటి వెంకటేష్గా గుర్తించి అరెస్ట్ చేశారు.నిందితుడు మొత్తం మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.




ఒక ఇంట్లో మొబైల్ ఫోన్, మరో ఇంట్లో వెండి వస్తువులు, మరో ఇంట్లో 3 గ్రాముల బంగారం , రూ.60,000/- నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడి వద్ద నుండి మొబైల్ ఫోన్ మరియు 3 గ్రాముల బంగారం విజయవంతంగా రికవరీ చేశారు.నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

### 3. రూ.10 లక్షల విలువైన నాలుగు బ్యాటరీల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్ – బ్యాటరీలు రికవరీ

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని EV ఛార్జింగ్ స్టేషన్‌లో పనిచేస్తున్న తోట గురువప్ప ఆగస్టు 15వ తేదీన నాలుగు బ్యాటరీలను చోరీ చేసినట్లు ఫిర్యాదు అందింది.ఛార్జింగ్ స్టేషన్ సూపర్‌వైజర్ మహేష్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో నిందితుడు చోరీ చేసిన బ్యాటరీలను స్క్రాప్ షాపులో విక్రయించి, వచ్చిన డబ్బుతో తన స్వస్థలమైన గిద్దలూరుకు వెళ్లిపోయినట్లు గుర్తించారు.ఒక్కో బ్యాటరీ విలువ సుమారు రూ.2.50 లక్షలు కాగా, నాలుగు బ్యాటరీల మొత్తం విలువ సుమారు రూ.10 లక్షలు.నిందితుడి ఆచూకీని గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని గిద్దలూరుకు పంపించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి చోరీకి గురైన నాలుగు బ్యాటరీలను విజయవంతంగా రికవరీ చేశారు.నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది.

### పోలీసుల ప్రత్యేక దృష్టి

నేరాల నియంత్రణ, కేసుల త్వరితగతిన ఛేదనకు జగద్గిరిగుట్ట పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు, సమన్వయంతో దర్యాప్తు చేపట్టి కేవలం రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించి, నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన విలువైన సొత్తును రికవరీ చేశారు.ఈ కేసులను డీసీపీ కుత్బుల్లాపూర్ కోటి రెడ్డి, ఆదేశాల మేరకు, ఏసీపీ కుత్బుల్లాపూర్ బాలగంగి రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా ఛేదించారు.కేసుల ఛేదనలో ఇన్‌స్పెక్టర్ సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి, ఏఎస్సై రామ్ కుమార్, పీసీలు నరేష్ గౌడ్, రమేష్ మరియు డబ్ల్యూపీసీ సుమ విశేష కృషి చేశారు.వారి సమర్థవంతమైన దర్యాప్తు, కృషి మరియు విధి నిర్వహణలో చూపిన ప్రతిభను ఉన్నతాధికారులు అభినందించి, తగిన రివార్డుతో సత్కరించారు.

## ప్రజావాణికి 56 ఫిర్యాదులు

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**
- **ప్రజావాణిలో మొత్తం 56 ఫిర్యాదుల స్వీకరణ**
- **రెవెన్యూ శాఖకు 27, ఇతర శాఖలకు 29 వినతులు**
- **అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి**
- **ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు సెప్టెంబర్ 07:**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27, ఇతర శాఖలకు సంబంధించిన 29, మొత్తం 56 వినతులు అందినట్లు



అధికారులు తెలిపారు.ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP) విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెట్లబుర్జ్ ఆసుపత్రిలో దోమల నివారణ చర్యలను పరిశీలించిన డా. కె. పద్మజ.

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

హైదరాబాద్‌లోని చార్మినార్ పరిధిలో ఉన్న ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్ ప్రాంగణం, పరిసరాల్లో చేపట్టిన దోమల నివారణ చర్యలను ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ (మలేరియా & ఫైలేరియా) డా. కె. పద్మజ గారు ఈ రోజు సాయంత్రం పరిశీలించారు.ఆసుపత్రి ప్రాంగణం, పరిసరాల్లో దోమల నియంత్రణలో భాగంగా నిర్వహించిన ఫాగింగ్ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డా. కె.పద్మజ గారు మాట్లాడుతూ, ఫాగింగ్‌తో పాటు జీహెచ్ఎంసీ, ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో ముందస్తుగా లార్వా నిర్మూలన చర్యలు చేపట్టి దోమల ఉత్పత్తిని అరికట్టాలని సూచించారు.డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా కేసులు నమోదైన వెంటనే సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేసులు నమోదైన ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలు, ALO కార్యకలాపాలు, IRS, ISS, హెల్త్ క్యాంపులు, IEC అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డా. ఆర్. ప్రవీణ్, ఎంపీహెచ్ఈఓ తిరుపతి



నాయక్, ఆరోగ్యశాఖ సిబ్బంది, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికైన జగదీశ్వరి గారిని ఘనంగా సన్మానించి అభినందించిన



- **ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజాసంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్**


**మంచాల వెలుతురు సెప్టెంబర్ 07:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల పరిధిలోని ప్రాథమిక పాఠశా ల హరి జనవాడ ఉపాధ్యాయురాలైన జగదీశ్వరి గారికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎ న్నికైన సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజాసంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భా స్కర్ ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు ఈసందర్భంగా ప్రజాసంఘాల నియోజక వర్గ అధ్యక్షులు కంబాలపల్లి భా స్కర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది అత్యంత పవిత్రమైన వృత్తి అని నేడు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎంతో ఉత్తమ ప్రతిభ కలవారని ప్రభుత్వ పాఠశాలకు వారు చేస్తున్నటు వంటి సేవలు మర్చిపోలేమని అని అ న్నారు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం తాముఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని ఇంకా ముందు ముందు కూడా కృషి చేస్తామని ప్రభుత్వ పాఠశాలలకు అండగా ఉంటామని అ ని అన్నారు ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ గౌడ్ ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి శ్రీ కాంత్ రమేష్ ఐలయ్య జహీర్ రాజు నాయక్ చిన్నికృష్ణ హాతిరామ్ శ్రీనివాస్ దత్తాత్రేయ శ్రీలత రజిని శాలిని తదితరులు పాల్గొన్నారు

# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్..329 మందిపై కేసులు

**సైబరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP అడ్మిన్, జి నరేందర్.ఈ డ్రైవ్‌లో భాగంగా 329 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.270 ద్విచక్ర వాహనదారులు,18 ఆటోలు,41 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —184 మంది 36 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -98 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -47 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి



ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత –2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.గత వారం (31.08.2026 to 05.09.2026) లో 213 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.15 మందికి జరిమానా, జైలు శిక్ష, 01 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,197 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలి: సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**సైబరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్స్, హుక్కా సెంటర్ల యజమానులతో సోమవారం సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, వ్యాపార సంస్థల యజమానులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థలు చట్టబద్ధంగా, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ తమ కార్యకలాపాలను నిర్వహించాలని సూచించారు. ప్రతి వ్యాపార సంస్థకు అవసరమైన అన్ని అనుమతులు, లైసెన్సు లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌ఓసీ, సీఎంసీ ఎన్‌ఓసీ, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎన్‌ఓసీ, టౌన్ ప్లానింగ్ ఎన్‌ఓసీ తదితర అవసరమైన అనుమతులను పొందాలని సూచించారు. CPPMS పోర్టల్ ద్వారా జారీ చేసిన లైసెన్సుల గడువు ముగిసిన వెంటనే వాటిని సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు.సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో లైసెన్సులు పొందిన సంస్థల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సంఖ్యలో హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ తదితర వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీపీ తెలిపారు. కొన్ని సంస్థలు సరైన లైసెన్సులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. చెల్లుబాటు అయ్యే లైసెన్సులు, అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.సమావేశంలో వ్యాపార యజమా నులు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వివిధ శాఖలకు సంబంధించిన లైసెన్సులు, అనుమతుల సమయాలు వేర్వేరుగా ఉండటం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని, నిబంధనలకు లోబడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను సూచించారు.పబ్స్, బార్లు తదితర సంస్థల్లో అనుమతించిన సమయం ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ కార్యకలాపాలు కొనసాగించరాదని సీపీ స్పష్టం చేశారు. నిర్ణీత సమయాలను ఖచ్చితంగా పాటించాలని, సమయం ముగిసిన తర్వాత మద్యం విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలు నిర్వహించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో బార్ అండ్ రెస్టారెంట్లు లోకి మైనర్లు ను అనుమతించవద్దని సూచించారు. వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన ఆధార్ ధృవీకరణ, గుర్తింపు పత్రాలు, వయస్సు నిర్ధారణకు సంబంధించిన వివరాలు తప్పనిసరిగా ఉండేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనర్ల ను నిబంధనలకు విరుద్ధంగా పనిలోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. హోటల్స్, పబ్స్, రెస్టారెంట్లలో వినియోగదారుల ప్రవర్తనపై కూడా యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ఎవరైనా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు లేదా ఇతర ప్రముఖుల బంధువులమని చెప్పుకుని సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినా, నిబం ధనలు ఉల్లం ఘించినా వారికి ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు ఉండ వని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమేనని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.బార్లు, పబ్‌లలో గ్యాంగ్‌ల మధ్య గొడవలు, ఘర్షణలు జరిగే పరిస్థితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని సీపీ సూచించారు. ఇటువంటి ఘటనలు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు శాంతిభద్రతల సమస్యలకు దారితీస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత పదార్థాల వినియోగం, విక్రయాల ను పూర్తిగా అరికట్టేందుకు వ్యాపార సంస్థల యాజమా న్యాలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. తెలంగాణలో



హుక్కా కార్యకలాపాలు నిషేధించబడిన నేప థ్యంలో, ఎట్టి పరిస్థితుల్లోనూ హుక్కా సెంటర్లను నిర్వహించ రాదని సీపీ స్పష్టం చేశారు. COTPA చట్టంలోని నిబంధనలను ఉల్లంఘిస్తూ హుక్కా కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడితే గరిష్టంగా 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు.సైబరాబాద్ పోలీసుల లక్ష్యం వ్యాపారాలను అడ్డుకోవడం కాదని, చట్టబద్ధంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు నిర్వహించే వారికి సైబరాబాద్ పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని సీపీ తెలిపారు. అయితే చట్టాలు, నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యాపారాలు నిర్వహించే సంస్థలపై మాత్రం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. హోటల్స్, రెస్టారెంట్లు, పబ్స్ సంస్థల యజమానులు పోలీసులకు సహకరిస్తూ నిర్ణీత సమయాలు,, వయస్సు ధృవీక రణ, మాదకద్రవ్యాల నియంత్రణ, ప్రజా భద్రతకు సం బం ధించిన అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించా లని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, ఐపీఎస్ సూచిం చారు.ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఐపీఎ స్, కూక ట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్, శేరిలింగంపల్లి డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలి

- **మంచాల మండలం బిఆర్ఎస్ అధ్యక్షుడు చీరాల రమేష్ ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ నాయక్**

**మంచాల వెలుతురు సెప్టెంబర్ 07:**

మంచాల మండలం ప్రజావాణిలో బిఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ నాయక్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి వివిధ సమ స్యలపై ఎంపీడీవో అధికారి వసంతలక్ష్మి కి వినతి పత్రం అందజేసిన బిఅర్ఎస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎ న్నికల సమయంలో ఇచ్చిన ఆరు




గ్యారంటీలు 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ ఈకార్యక్రమంలో మంచాల వ్యవసాయ సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ బుస్సు పుల్లారె డ్డి మాజీ యూత్ అధ్యక్షులు బద్రినాథ్ గుప్తా ఆరుట్ల సర్పంచ్ మానిపాటి శోభ కుమార్‌తోపాటు మండల నాయకులు రావుల శంకర్ రాజు నాయక్ అమరేందర్ రెడ్డి నవాజ్ పున్నం రాముజే ష్ బాలరాజ్ శ్రీధర్ రెడ్డి శ్రీకాంత్ వెంకటేష్ రఫీఖ్ కృష్ణ పవన్ రెడ్డి అవ శేఖర్ ఇర్ఫాన్ తదితరు లు పాల్గొన్నారు

# హుస్నాబాద్ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

- మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి తో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు పట్ల నియోజకవర్గ ప్రజల హర్షం

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 07:**

కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ (TGPS) మంజూరు కావడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, విద్యారంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.హుస్నాబాద్ కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించేందుకు 73 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.699.895 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ 2026 సెప్టెంబర్ 5న G.O.Rt.No.164 జారీ చేసింది.ఈ జాబితాలో కరీంనగర్ జిల్లా, హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం, చిగురుమామిడి మండలంలోని చిగురుమామిడి పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపిక చేశారు. ఈ పాఠశాల అభివృద్ధికి రూ.9.62 కోట్ల అంచనా వ్యయం కేటాయించారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక మౌలిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం వల్ల చిగురుమామిడి మండలంతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ప్రజలు పేర్కొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇందుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# డల్లాస్‌పురం రెస్టారెంట్ గ్రాండ్ ఓపెనింగ్

**రంగారెడ్డి జిల్లా, వెలుతురు సెప్టెంబర్ 7 :**

ఎల్బీనగర్ చింతలకుంట లో నూతనంగా ఏర్పాటు చేసిన డల్లాస్‌పురం రెస్టారెంట్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కుమారుడు, ప్రముఖ నటుడు ఆకాష్ ముఖ్య అతిథిగా హాజరై రెస్టారెంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభమైన డల్లాస్‌పురం రెస్టారెంట్ నిర్వాహకులు రాఘవేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారం, రుచికరమైన వంటకాలు, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. రెస్టారెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రుచికరమైన వంటకాలను అందించడంతో పాటు, నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి అతిథులు, సందర్శకులను ఆకట్టుకున్నారు.కార్యక్రమంలో నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక ప్రముఖులు, అభిమానులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఈశ్వరమ్మ యాదవ్, వేములయ్య గౌడ్ తదితరులు పాల్గొని డల్లాస్‌పురం రెస్టారెంట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి



- లేకుంటే రాజీనామా చేయాలి.
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 07:**

రోజున ఉదయం 10:30 గంటలకు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు గ్రీవెన్స్ డే సందర్భంగా రామన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు చేయనందున ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ నకిరేకల్ నియోజకవర్గం రామన్నపేట మండల ఎంపీడీవో కార్యాలయంలో విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగింది. కామెంట్స్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు 6 గ్యారెంటీలు మేనిఫెస్టో ఇచ్చిన ప్రకారం హామీలు నెరవేర్చలేదు. 6 గారంటీలు అమలు చేయాలని రాజ్యాంగబద్ధంగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు నిరసన తెలుపుతుంటే వారిని బలవంతంగా అరెస్టు చేసే కార్యక్రమం చేస్తున్నారు.అందులో మాజీ మంత్రులు మహిళా నాయకులు ఉన్నారని చూడకుండా పోలీసు వారు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించిన తీరు సరైంది. కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ బ్లాక్ టీ షర్ట్ మరియు రాజ్యాంగం బుక్ పట్టుకొని పార్లమెంట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తే తప్పు లేదు. కానీ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రాజ్యాంగబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తే తప్పు ఏంటి అన్నారు. మీకు చేతనైతే ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే రాజీనామా చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బందెల రాములు పోషబోయిన మల్లేశం మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బొక్క మాధవరెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్ గర్దాస్ విక్రమ్ పులిపలుపుల వీరస్వామి గొలుసుల సత్తయ్య మాజీ ఎంపీటీసీలు సర్పంచులు వేమవరం సుధీర్ బాబు, దోమల సతీష్, గాది పారిజాత, ఎండి అమీర్, కోళ్ల స్వామి జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, ఎస్కే చాందు, మందడి సాగర్ రెడ్డి పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, బత్తుల వెంకన్న, కాటేపల్లి యాదయ్య, కోళ్ల కిషన్, మంటి లింగస్వామి, జంగిలి నరసింహ, నల్ల స్వామి, తాళ్ల క్రాంతి, కుమార్ చొప్పరి, నరసింహ, బండ శ్రీనివాస్ రెడ్డి, మామిళ్ళ అశోక్, గంగుల రాఘవరెడ్డి, గుండాల రాంబాబు, నక్క నరేందర్, పులిగిల్ల పరమేష్, ఎండి అజాజ్, ఆవుల శ్రీధర్, జాల అమరేందర్ రెడ్డి, నల్ల సైదులు, రాస వెంకటేశ్వర్లు, బలువుల కృష్ణగర్దాస్, కరుణాకర్, బత్తిని మహేష్, కూనూరు లింగస్వామి, గాది శంకర్, మామిళ్ళ కుమార్, బాసాని రాజు, బీరం రాజిరెడ్డి, మందడి నర్సిరెడ్డి, చలమల్ల బిక్షం రెడ్డి, గట్టు శేఖర్, వంగాల సాయి తదితరులు పాల్గొనడం జరిగింది.




# హయత్‌నగర్‌లో లీడర్స్ క్లబ్ క్లాతింగ్ స్టోర్ ఘన ప్రారంభం

**హయత్‌నగర్, వెలుతురు సెప్టెంబర్ 7 :**

హయత్‌నగర్‌లోని బాబాయ్ హోటల్ వెనుక, పోస్టాఫీస్ సమీపంలో లీడర్స్ క్లబ్ క్లాతింగ్ స్టోర్ నూతన షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన దుస్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రముఖ బ్రాండ్ల దుస్తులతో పాటు వివిధ రకాల షర్ట్స్, ప్యాంట్స్, సూటింగ్స్, షర్టింగ్స్ తదితర వస్త్రాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో పారంధ యాదగిరి, కాటేపాక కృష్ణ, పారంధ నరసింగరావు, కాటేపాక స్కైలాబ్, కాటేపాక ప్రవీణ్ తదితరులు పాల్గొని నూతన వస్త్ర దుకాణం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యత, సరసమైన ధరలు, విభిన్నమైన డిజైన్లతో సేవలు అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. షోరూమ్ ప్రారంభంతో స్థానికంగా వినియోగదారులకు మరింత మెరుగైన వస్త్రాల ఎంపికకు అవకాశం లభించిందని పేర్కొన్నారు.

# రామన్నపేట మండలం బిజెపి నాయకుల అక్రమ అరెస్టు

**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 07:**



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య బీజేపీ మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి నీ అక్రమంగా అరెస్టు చేయడం మండల శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. 15000 కోట్ల ఫీజు రీయిం బర్సమెంట్ బకాయిలు విడుదల చేయకుండా 40 లక్షల మంది తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.విద్యార్థుల హక్కుల సాధనకై ధర్నా చౌక్ లో 'విద్యార్థి మహాధర్నా'కు బిజెపి పిలుపునిస్తే.. భయంతో వణికిపోయి అనుమతి నిరాకరించిన ఈ పిరికి, నియంత కాంగ్రెస్ సర్కారు బిజెపి నాయకులను అక్రమ అరెస్టులు చేసి అరాచక పాలనని సృష్టిస్తుంది. ఇలాంటి చర్యలకు బిజెపి ఎప్పటికీ భయపడదు ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని చూస్తే ఊరుకునేది లేదు. విద్యార్థుల పక్షాన బిజెపి పోరాటం ఆగదు. ఈ అహంకార ప్రభుత్వ మెడలు వంచేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందుకు కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ నీ త్వరలోనే గద్దె దించి ఈ అరాచక పాలన నీ అంత మందించేవరకు బిజెపి పోరాటం ఆగదు. అని స్పష్టం చేయడం జరిగింది.

# శ్రీపాద ఫ్యూయల్స్ ఆధ్వర్యంలో టోటల్ ఎనర్జీస్ ఆటో ఎల్పీజీ బంక్ ఘన ప్రారంభం

**బైరాములగూడ, సెప్టెంబర్ 7:**

బైరాములగూడలో శ్రీపాద ఫ్యూయల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోటల్ ఎనర్జీస్ ఆటో ఎల్పీజీ గ్యాస్ బంక్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, చీకోటి ప్రవీణ్, పీఎం సాయి ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై బంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భరత్ యాదవ్, తరుణ్ సంతోష్లకు శుభాకాంక్షలు తెలిపారు.శ్రీపాద ఫ్యూయల్స్ ద్వారా వాహనదారులకు నాణ్యమైన ఇంధనం, పక్కా పరిమాణం, మెరుగైన మైలేజీతో సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్యాస్ నింపించుకునే వినియోగదారులకు ఉచిత టీ అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, నాగరాజు, సురేష్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభమైన శ్రీపాద ఫ్యూయల్స్ టోటల్ ఎనర్జీస్ ఆటో ఎల్పీజీ బంక్ వాహనదారులకు మెరుగైన సేవలు అందిస్తూ విజయవంతంగా కొనసాగాలని నాయకులు ఆకాంక్షించారు.



# గునుగల్ లో పందుగుల ధనం జయగౌడ్ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**యాచారం వెలుతురు సెప్టెంబర్ 07:**

యాచారం మండలం గునుగల్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు దూసరి రాజు గౌడ్ మామ పందుగుల ధనంజయ గౌడ్ నూ తనంగా నిర్మించిన ఇంటి గృహ ప్ర వేశ వేడుకల్లో పాల్గొని దేవుడికి పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఇబ్ర హీంపట్నం నియోజకవర్గం నాయ కుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆ యన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియ ర్ నాయకులు గుడ్డిమల్ల చంద్ర య్య ముదిరాజ్ అంతటి రాజు గౌ డ్ కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్ దూసరి రమేష్ గౌడ్ తదిత రులు పాల్గొన్నారు



# ఉపసర్పంచ్ పేరు వద్దన్న ప్రోటోకాల్.. సర్పంచ్ భర్త పేరు ఎలా వచ్చింది? అధికారులను ప్రశ్నించిన విజయ్ కుమార్"

**కేశవపట్నం వెలుతురు సెప్టెంబర్ 07:**



కాచాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై సర్పంచ్ భర్త పేరు చేర్చిన అంశంపై వివరణ కోరడం గురించి.ఇటీవల కేశవపట్నం గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలపై ఉపసర్పంచ్ పేరు కూడా ఉండాలని మీతో చర్చించిన విషయం మీకు తెలిసిందే.ఆ సందర్భంగా మీరు ప్రోటోకాల్ ప్రకారం ఉపసర్పంచ్ పేరు శిలాఫలకంపై ఉండదని, అలాగే మహిళా సర్పంచ్ ఉన్న గ్రామాల్లో వారి భర్తల పేర్లను కూడా శిలాఫలకాలపై చేర్చడం ప్రోటోకాల్ ప్రకారం కాదని నాకు స్పష్టంగా తెలియజేశారు.అయితే 05-09-2026న కాచాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉపకేంద్రం శిలాఫలకంపై మహిళా సర్పంచ్ గారి భర్త పేరు చేర్చినట్లు ఈ శిలాఫలకం ద్వారా స్పష్టంగా కనిపిస్తోంది.

**దీంతో సహజంగానే కొన్ని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి:**

1. ఉపసర్పంచ్ పేరు శిలాఫలకంపై ఉండకూడదని పేర్కొన్న ప్రోటోకాల్ ఏది?
2. మహిళా సర్పంచ్ భర్త పేరు శిలాఫలకంపై చేర్చడానికి ఏ ప్రోటోకాల్/ప్రభుత్వ ఉత్తర్వు ఆధారం?
3. కేశవపట్నం విషయంలో ఒక విధమైన ప్రోటోకాల్, కాచాపూర్ విషయంలో మరో విధమైన విధానం ఎందుకు అమలు చేయబడింది?
4. ఈ శిలాఫలకాన్ని రూపొందించి ఏర్పాటు చేయడానికి ఎవరి అనుమతి లేదా ఆమోదం తీసుకున్నారు?

కాబట్టి కాచాపూర్ ఆరోగ్య ఉపకేంద్రం శిలాఫలకంపై సర్పంచ్ గారి భర్త పేరు ఏ నిబంధన లేదా ప్రోటోకాల్ ప్రకారం చేర్చారో, అందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వు/నిబంధన వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయగలరు.అదేవిధంగా, ఉపసర్పంచ్‌ల పేర్లు శిలాఫలకాలపై ఉండకూడదని పేర్కొంటున్న ప్రోటోకాల్ లేదా ప్రభుత్వ ఉత్తర్వు కాపీని కూడా అందజేయగలరు.ఈ విషయంలో అందరికీ ఒకే విధమైన నిబంధనలు, ఒకే విధమైన ప్రోటోకాల్ అమలు చేయాలని కోరుతున్నాను.

**చేర్చవచ్చు:**

"ప్రోటోకాల్ పేరుతో ఉపసర్పంచ్‌ల హక్కులను నిరాకరిస్తూ, అదే ప్రోటోకాల్‌కు విరుద్ధంగా మరొక సందర్భంలో సర్పంచ్ భర్త పేరు శిలాఫలకంపై చేర్చడం పట్ల స్పష్టత అవసరం. కాబట్టి ఎలాంటి పక్షపాతం లేకుండా నిబంధనల ప్రకారం ఏకరీతిన వ్యవహరించాలని కోరుతున్నాను."

**ప్రతులు:**

1. గౌరవ జిల్లా కలెక్టర్ గారు, కరీంనగర్ జిల్లా.
2. జిల్లా పంచాయతీ అధికారి (DPO) గారు, కరీంనగర్.
3. ఎంపీడీవో గారు, శంకరపట్నం మండలం.
4. ఎంపీవో గారు, శంకరపట్నం మండలం.



**ధన్యవాదములతో,**
**ఆకుబత్తిని విజయ్ కుమార్**
**ఉపసర్పంచ్ – కేశవపట్నం**
**అధ్యక్షులు – కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం**
**మొబైల్ నంబర్:9949198143**

# సెప్టెంబర్ 10న "చలో హైదరాబాద్ – మహా ధర్నా"ను విజయవంతం చేయాలి

- TGEJAC హైదరాబాద్ సిటీ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో సన్నాహక సభలు – చైర్మన్ కట్కూరి శ్రీకాంత్

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7, :**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGEJAC) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10, 2026న నిర్వహించనున్న "చలో హైదరాబాద్ – మహా ధర్నా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని TGEJAC రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.ఈ పిలుపు మేరకు TGEJAC హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో సన్నాహక సభలు నిర్వహించారు.

**సన్నాహక సభలు నిర్వహించిన శాఖలు:**

1. నీటిపారుదల శాఖ
2. వాణిజ్య పన్నుల శాఖ – HoD
3. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్
4. మీడియా అకాడమీ

ఈ సన్నాహక సభల్లో ఉద్యోగులకు సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**ఉద్యోగుల హక్కుల సాధన కోసమే పోరాటం**

ఈ సందర్భంగా TGEJAC హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమం ప్రభుత్వానికి, ప్రజలకు లేదా మరే ఇతర వర్గానికి వ్యతిరేకంగా కాదని, ఉద్యోగుల హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తున్న పోరాటమని తెలిపారు.సెప్టెంబర్ 10న నిర్వహించనున్న భారీ "చలో హైదరాబాద్ – మహా ధర్నా" కార్యక్రమానికి ఈ సన్నాహక సభలు ఒక ముందడుగని పేర్కొన్నారు. ఉద్యోగులంతా ఐక్యంగా, సంఘటితంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఉద్యోగుల ఐక్యత, సంఘటిత పోరాటంతోనే న్యాయమైన డిమాండ్లను సాధించుకోగలమని శ్రీకాంత్ తెలిపారు.

**ఉద్యోగులంతా ఐక్యంగా పాల్గొనాలి – గండూరి వెంకట్**




TGEJAC హైదరాబాద్ సిటీ కన్వీనర్ గండూరి వెంకట్ మాట్లాడుతూ, TGEJAC రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ నాయకత్వంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు.సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాల్లో హైదరాబాద్ జిల్లా కన్వీనర్ కృష్ణ యాదవ్, నజీర్ అహ్మద్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ సెక్రెటరీ టిఎన్జీఎస్ భీమ్ సింగ్, అర్మని రాజు, నీటిపారుదల శాఖ అధ్యక్షులు మన సెక్రెటరీ శిరీష గణేష్ వాణిజ్య పనుల శాఖ అధ్యక్షులు చిన్నన్న కార్యదర్శి, సర్వీస్ కమిషన్ శివకుమార్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన గెజిటెడ్ అధికారులు (GOs), నాన్-గెజిటెడ్ అధికారులు (NGOs), DEOs ,ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన "ఉద్యోగ పోరు బాట" గీతాన్ని చి ఉద్యోగులు ఉత్తేజం పొందారు.

# శాసనసభలో బీజేపీ సభ్యులకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్

- బిఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయి.

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**



ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. ప్రతిపక్షం ఏ ప్రశ్న అడిగినా సమాధానం చెప్పేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి వంటి ముఖ్యమైన ప్రజా సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉంది. సభా సమయాన్ని రాజకీయ ఆరోపణలతో వృథా చేయడం సరికాదు. BACలో ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను ముందుగా చర్చిద్దామని స్పష్టంగా చెప్పాం. ప్రజలకు ఉపయోగపడే అంశాలను పక్కన పెట్టి రాజకీయ రాద్ధాంతం చేయడం ఎందుకు? కాళేశ్వరం విషయంలో బీజేపీ వైఖరి ఏమిటో ప్రజలకు చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిబిఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదు? కాళేశ్వరం అవినీతి, ప్రజాధనం దుర్విని యోగంపై నిజాలు బయటకు రావాలంటే కేంద్రం కూడా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ఒక మాట, కేంద్రంలో మరో మాట మాట్లాడటం ప్రజలను మోసం చేయడమే. బీజేపీ–బీ ఆర్ఎస్ కలిసి కాళేశ్వరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నాయనే అనుమానం ప్రజల్లో కలుగుతోంది. నిజంగా కాళేశ్వరంపై చిత్తశుద్ధి ఉంటే సిబిఐ విచారణకు ఎందుకు ముందుకు రావడం లేదు? ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే లక్ష్యంగా కాకుండా ప్రజా సమస్యలపై చర్చకు ప్రతిపక్షాలు ముందుకు రావాలి. విద్య, ఫీజు రీయింబర్స్ మెంట్, ఎస్సీల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మహేశ్వర్ రెడ్డి గారు సీనియర్ శాసనసభ్యులు. ఆయన ఏ అంశం లేవనెత్తినా సమాధానం ఇవ్వడానికి, చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. “ప్రజా సమస్యలపై చర్చకు మేము సిద్ధం.. రాజకీయ డ్రామాలకు కాదు. కాళేశ్వరంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సిబిఐ విచారణకు ఎందుకు ముందుకు రావడం లేదో చెప్పాలి.”

# హుజురాబాద్ - సుందరగిరి రహదారిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.60 కోట్ల పరిపాలనా అనుమతులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

- బ్రిడ్జి నిర్మాణంతో పరిసర గ్రామాల ప్రజలక మరింత సులభతరం కానున్న రాకపోకలు

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు హుజురాబాద్ కి వెళ్ళే మార్గంలో ఎదుర వుతున్న ఇబ్బందులు హైలెవల్ బ్రిడ్జి మంజూరు తో తీరనున్నాయని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.నియోజకవర్గ ప్రజలకు రవాణా సౌకర్యాల మెరుగుదలకు మరో కీలక ముందడుగు పడిందని ఆకాంక్షించారు.హుజురాబాద్ – సుందరగిరి రహదారిపై కిలోమీటర్ 10/0–2 వద్ద 6 వెర్టికల్ (6V) హైలెవల్ బ్రిడ్జి (10 మీటర్ల వెడల్పు) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6.60 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి వెల్లడించారు.MDR ప్లాన్ 2026–27 కింద ఈ నిధులను కేటాయిస్తూ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు G.O.Rt.No.474, తేదీ 07–09–2026 ద్వారా పరిపాలనా అనుమతి లభించింది. ఈ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజల ప్రయాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, వంతెనల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.హైలెవల్ బ్రిడ్జి మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రో,డ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి స్పష్టం చేశారు.. .మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి పట్ల తమ చిరకాల స్వప్నం చాలా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న హై లెవెల్ బ్రిడ్జి మంజూరు పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.

# జన్వాడలో అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం

- అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై హెచ్ ఎం డి ఏ—నార్సింగి టౌన్ ప్లానింగ్ సంయుక్త దాడులు

**శంకర్ పల్లి, వెలుతురు సెప్టెంబర్ 7 :**

మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో అనధికారిక లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమ నిర్మాణాలపై కొనసాగుతున్న కఠిన చర్యల్లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్–45 టౌన్ ప్లానింగ్ సిబ్బంది, హెచ్ ఎం డి ఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సోమవారం జన్వాడలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్‌ను ధ్వంసం చేయడంతో పాటు, అక్కడ నిర్మించిన అక్రమ నిర్మాణాలు, నిర్మాణ భాగాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కూల్చివేశాయి. సంబంధిత నిబంధనల ప్రకారం ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేయడం, నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. భూ యజమానులు, డెవలపర్లు ముందుగా సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన తరువాతే లేఅవుట్లు, నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి చేపట్టే నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని హెచ్చరించారు .జన్వాడతో



పాటు పరిసర ప్రాంతాల్లోనూ అక్రమ లేఅవుట్లు, అనధికారిక నిర్మాణాలపై తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.ఈ సంయుక్త చర్యల్లో నార్సింగి అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రసీద, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రమేష్, హెచ్ ఎం డి ఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయలక్ష్మికి మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**



తెలంగాణ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయలక్ష్మి గారికి రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య & క్రీడలు & యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన పురోగతి కోసం ప్లానింగ్ కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విజయలక్ష్మి గారి అనుభవం, సమర్థతతో కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రజా సంక్షేమం, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి, యువతకు మెరుగైన అవకాశాల కల్పనతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఆమె చేస్తున్న కృషి విజయవంతం కావాలని మంత్రి ఆకాంక్షించారు.గద్వాల విజయలక్ష్మి కి ఈ కొత్త బాధ్యతల్లో మంచి విజయాలు సాధించాలని కోరుకుంటూ మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు.

# దండుమైలారం జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు రామకృష్ణకు సింగపూర్ పర్యటన అవకాశం రావడం అభినందనీయం

- మంచాల మండలం టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ అజ్మత్ ఖాన్

**ఇబ్రహీంపట్నం వెలుతురు సెప్టెంబర్ 07:**

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మంచాల మండలం టీఎస్ యు టిఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ అ జ్మత్ ఖాన్ మాట్లాడుతూ దండుమైలారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రా మకృష్ణకు అరుదైన గుర్తింపుపేద కుటుంబంలో జన్మించి.ప్రభుత్వ పాఠశాల లో విద్యనభ్యసించి అదే ప్రభుత్వ విద్యావ్యవస్థలోఉపాధ్యాయుడిగా సేవలందిస్తూ తన ప్రతిభను నిరూపించుకున్న దండుమైలారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలగణిత శాస్త్ర ఉపాధ్యాయుడు రామకృష్ణకు ఎక్స్పోజర్ లో భాగంగా సింగపూర్ పర్యటించే అరుదైన అవకాశం లభించడం అభి నందనీయమ ని అన్నారుతెలంగాణ ప్రభుత్వంద్వారా లభించిన ఈఅవకాశాన్ని రామకృష్ణ అందిపుచ్చుకోవ డం ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రతిభకు లభించిన గౌరవంగా ఆయన పేర్కొన్నారు ఆర్థిక ఇబ్బం దులు ఎన్నోన వాళ్లను అధిగమిస్తూ విద్యనే ఆయుధంగా చేసుకుని ముందుకు సాగిన రామ కృ ష్ణ నేడు ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు విద్యార్థుల్లో సృజనాత్మ కత శాస్త్రీయ దృక్పథం నూతన ఆలోచనా విధానం పెంపొందించడంలో రామకృష్ణ చేస్తున్న కృషి ప్రశంస నీయమని డాక్టర్ ఆజ్మత్ ఖాన్ అన్నారు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు కూడా అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని రామకృష్ణకు దక్కిన సింగపూర్ అవకాశం చాటిచెబుతోందన్నారు సింగపూర్ పర్యటనలో అక్కడి విద్యావిధానం బోధనా పద్ధతులు సాంకే తిక పరిజ్ఞానం విని యోగం పాఠశాలల నిర్వహణ విద్యార్థుల అభ్యసన విధానాలను పరిశీలిం చి అక్కడి ఉత్తమ విధానాలను తెలంగాణ



ప్రభుత్వ పాఠ శాలల్లో అమలు చేసేందుకు రామ కృ ష్ణ కృషి చేయాలని ఆకాంక్షించారు పేదింటి బిడ్డగా మొదలైన రామకృష్ణ ప్రయాణం ప్రభుత్వపా ఠశాల ఉపాధ్యాయుడిగా ఎదిగ ఇప్పుడు సింగపూర్ వరకు చేరుకోవడం ఎంతోమంది విద్యార్థులకు యువతకు స్ఫూర్తిదాయకం ఇది రామకృష్ణ వ్యక్తిగత విజయమే కాకుండా ప్రభుత్వ విద్యా వ్యవస్థకు దక్కిన గౌరవంఅని డాక్టర్ ఆజ్మత్ ఖాన్ పేర్కొన్నారు రామకృష్ణ సింగపూర్ పర్యటన విజయవంతం కావాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తెలంగాణ ప్రభుత్వ విద్యకు మరింత పేరు తీ సుకురావాలని ఆయన ఆకాంక్షించారు ఈకార్యక్రమంలో మంచాల మండల టీఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి తుల్జారామ్ కోశాధికారి ప్రభు ఉపాధ్యక్షులు మండల యా దయ్య,శ్యామల మజరుల్లాఖాన్ జిల్లా కౌన్సిలర్లు మోతిలాల్ వెంకట్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుడా చైర్మన్ గుండు సుధారాణికి మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**



మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ గుండు సుధారాణి మర్యాద పూర్వకంగా కలిశారు.ఇటీవల కుడా చైర్మన్‌గా గుండు సుధారాణి నియమితులైన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కుడా పరిధిలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. కుడా చైర్మన్‌గా గుండు సుధారాణి విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని మంత్రి ఆకాంక్షించారు.

# అశోక్ నగర్‌లో ఘనంగా, ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమం

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 07:**



శ్రీ కృష్ణాష్టమి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని పురస్కరించుకుని అశోక్ నగర్ డివిజన్‌లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ఉమారాణి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు డివిజన్ ప్రజలు, యూత్ క్లబ్ సభ్యులు పెద్దఎత్తున తరలివచ్చారు.శ్రీకృష్ణ భగవానుడి బాల్య లీలలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వేడుకల్లో యువకులు, చిన్నారులు అత్యుత్సాహంతో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీపడగా, డివిజన్ మొత్తం శ్రీకృష్ణ నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమం ద్వారా స్థానికులలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉమారాణి వెంకటరమణ మాట్లాడుతూ.. మన సాంస్కృతిక సంప్రదాయాలను, పండుగలను ఘనంగా నిర్వహించడం ద్వారా భావితరాలకు మన సంస్కృతిని అందించవచ్చని తెలిపారు. డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని శ్రీకృష్ణుడిని ప్రార్థించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకలను విజయవంతం చేయడానికి సహకరించిన యూత్ క్లబ్ సభ్యులకు, డివిజన్ ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు....
- ఎంపీడీఓకు ప్రజావాణిలో ఫిర్యాదు...
- బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ డిమాండ్...

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశాల మేరకు తట్టు నారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తట్టు నారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా పలు హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతు భరోసా, రైతు బీమా, పంటలకు గిట్టుబాటు ధర, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటర్లు, కౌలు రైతులకు న్యాయం, కల్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం, కేసీఆర్ కిట్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఒకలా.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని, హామీలు అమలయ్యే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో సర్పంచులు దాసరి మచ్చేందర్, గోవర్ధన్‌రెడ్డి, అలిగి శ్రీనివాస్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఎక్కెల్లి రాజు, భీంరావ్ రాథోడ్, మోహన్‌రాథోడ్, అరుణ్‌కుమార్ తదితరులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులను గోస పెడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇక మనుగడ లేదు..

- కాంగ్రెస్ సర్కారుకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 07:**

ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను గోస పెడుతున్న రేవంత్ రెడ్డి ఇక ప్రభుత్వానికి మనుగడ లేదనీ, విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజున హైదరాబాదులో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల బిజెపి నేతలు పాల్గొన్నారు. చలో అసెంబ్లీ ప్రోగ్రామ్ సందర్భంగా అసెంబ్లీ వైపు తల్లి వెళ్ళిన తిమ్మాపూర్ బీజేపీ నాయకులు కార్యకర్తలను అరెస్టు చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ అక్రమ అరెస్ట్ లపై రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ చెల్లించకుండా వారి భవిష్యత్తు తో చెలగాటం పడుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబ ర్స్మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలని లేకపోతే బిజెపి ఆధ్వర్యంలో పోరాటాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు సంజీవ రెడ్డి ,కరీంనగర్ జిల్లా ఉపాధ్య క్షులు గుర్రాల వెంకట్ రెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివెద మహిపాల్ రెడ్డి , తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ , మండల కిసాన్ మోర్చా కార్యదర్శులు మధుకర్ రెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిల కోసం ఛలో ఇందిరాపార్క్.. బీజేపీ నేత అరెస్ట్

- న్యాల్కల్ మండల బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్‌ను హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు.

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**



విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన విద్యార్థి మహాధర్నాకు బయలుదేరిన బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మార్గమధ్యలో అదుపులోకి తీసుకున్న పోలీసు లు ఆయనను హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపు మేరకు ఛలో ఇందిరాపార్క్ కార్యక్రమానికి మల్లేష్ గంగ్వార్ బయలుదేరారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయనను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.మల్లేష్ గంగ్వార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# తెలంగాణ అసెంబ్లీ - 2026 వర్షాకాల సమావేశాల్లో చర్చ కోసం BJLP ప్రతిపాదిస్తున్న ప్రజాసమస్యలు

- **ఏలేటి మహేశ్వర్ రెడ్డి బిజెపి శాసన పక్ష నాయకులు**

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

తెలంగాణ అసెంబ్లీ – 2026 వర్షాకాల సమావేశాల్లో చర్చ కోసం BJLP ప్రతిపాదిస్తున్న ప్రజాసమస్యలు

1. నిషేధిత భూముల జాబితా, 22A అంశం ... ధరణి పోర్టలును భూ భారతి గా మార్చినప్పటికీ నిషేధిత భూముల జాబితా సమస్య పరిష్కారం కాకపోగా మరింతగా సమస్యాత్మకం కావడం ... ఏకంగా కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడం, అధికారుల తప్పిదమని స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు అంగీకరించి ప్రజలకు క్షమాపణలు చెప్పడం ... 22A జాబితా వెనక కుట్ర ఉందని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడడం ... ధరణి పోర్టల్ అక్రమాలపై జరిపిని ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేయకపోవడం ... ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, అసైన్డు భూములు, ఫారెస్టు భూములు, దేవాలయాల భూములు, భూదాన్ భూముల అన్యాక్రాంతం – విచారణ చేపట్టని కాంగ్రెస్ సర్కార్ ...

### 2. ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించడం ... విద్యారంగంలోని ఇతర సమస్యలు

ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించడం ... విద్యార్థులకు రూ.ఐదు లక్షల విద్య భరోసా కార్డు ... ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ... కాలేజీ యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు అందజేత ... మూతపడిన పాఠశాలల పునరుద్ధరణ ... ప్రతి పల్లెకు ప్రైమరీ స్కూలు, గ్రామానికి హైస్కూలు, మండలానికి జూనియర్ కాలేజీ, అసెంబ్లీ నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ, జిల్లా హెడ్ క్వార్టర్స్ లో పీజీ కాలేజీలను ఏర్పాటు చేయడం ... హై స్కూలు స్థాయిలో దశలవారీగా ఇంగ్లీష్ మీడియం బోధన ... కాలేజీలు, యూనివర్సిటీల్లో అధ్యాపక ఖాళీల భర్తీ ... గురుకులాల్లో విద్యార్థుల మరణాలు ... గురుకులాలు, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు ... పలువురు విద్యార్థులు ఆసుపత్రుల పాలు ...

### 3. వ్యవసాయరంగ సమస్యలు

రైతుల ఆత్మహత్యలు ... పంట రుణాల మాఫీ ... రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సహాయంగా ఎకరానికి ఏటా రూ.12 వేలు ఇచ్చే రైతు భరోసా (రైతుబంధు) పథకం ... రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇచ్చే ఆత్మీయ భరోసా పథకం ... వరి క్వింటాకు రూ.500 బోనస్ ... ఇతర తొమ్మిది పంటలకు బోనస్ ... పంటలకు గిట్టుబాటు ధరలు ... ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం ... పంట నష్ట పరిహారం అందించేలా పటిష్టమైన పంటల బీమా పథకం ... యూరియా కొరత ...

### 4. సాగునీటి (ఇరిగేషన్) రంగం - సమస్యలు

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం ... కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలు ... జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదికలోని మూడు బ్యారేజీల నిర్మాణంపై కాకుండా మొత్తం ప్రాజెక్టు నిర్మాణం, వ్యయంపై సమగ్ర విచారణను సిబిఐకి అప్పగించడం ... విజిలెన్స్ కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోకపోవడం ... మేడిగడ్డ మరమ్మత్తులు ... ప్రాజెక్టు వినియోగం ... ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా ఆదిలాబాదుతో పాటు ఇతర జిల్లాలకు సాగునీరు అందించడం ... పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ... నలభై వేల చెరువుల నిర్వహణను నీటి సంఘాలకు అప్పగించడం ... మిషన్ కాకతీయలో అక్రమాలు ... ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరం–నల్లమలసాగర్ నిర్మాణం వల్ల తెలంగాణకు జరిగే నష్టం – ఏపీ జలదోపిడీని అడ్డుకోవడంలో విఫలమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం

5. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ... తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట పట్టిన ఉద్యోగ సంఘాలు ... సమస్యలను పరిష్కరించకుండా కమిటీలు వేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడుతున్న ఉద్యోగ జేఏసి ... ఇంకా పెండింగులోనే రూ.వేల కోట్ల బకాయిలు – పెండింగులోనే ఆరు డి.ఏ.లు ...

### 6. ఉద్యోగ ఖాళీల భర్తీ, ఉపాధి అవకాశాల వంటి నిరుద్యోగుల సమస్యలు

ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా అమలు కాని రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ హామీ ... ప్రతి ఏడాది జూన్ రెండు నాటికి ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ... నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ... ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ... యూత్ కమిషన్ ఏర్పాటు ... 10 లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయాలు కల్పించడం ... రాజీవ్ యువ వికాసం స్కీము అమలు

### 7. సామాజిక పెన్షన్లు - సమస్యలు

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులకు నెల పెన్షన్ రూ.4 వేలకు పెంచడం ... దివ్యాంగులకు నెల పెన్షన్ రూ.6వేలకు పెంచడం ... కొత్త పెన్షన్ల మంజూరు

### 8. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీల అమలు

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 12 లక్షల ఆర్థిక సాయం అందించే అంబేద్కర్ అభయ హస్తం పథకం ... ఎస్సీ, ఎస్టీల ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ... ఐదు కొత్త ఐటీడీఏలు, తొమ్మిది సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ... ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు విద్యాజ్యోతి పథకం స్కాలర్షిప్ ... అసైన్డు భూముల అంశం

### 9. బీసీ సంక్షేమం - సమస్యలు

స్థానిక ఎన్నికలు, విద్యా, ఉద్యోగావకాశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ... కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ... బీసీ సబ్ ప్లాన్ పేరుతో ఏడాదికి రూ.20వేల కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ హామీ ... బీసీల సంక్షేమానికి ఎంబీసీ కులాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు హామీ ... వివిధ సామాజిక వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు

### 10. మహిళలకు ఇచ్చిన హామీలు - సమస్యలు

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇచ్చే పథకం ... కళ్యాణమస్తు పథకం కింద నిరుపేద ఆడబిడ్డ వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ కానుకగా ఇస్తామన్న తులం (పది గ్రాములు) బంగారం ఇచ్చే స్కీము, మహిళా స్వయం సహాయక సంఘాలకు పావలా వడ్డీతో రుణాలు ఇచ్చే పథకం, అంగన్వాడీ టీచర్ల నెల వేతనాన్ని 18 వేలకు పెంచుతామన్న హామీల అమలు ...

11. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల కార్డు (అభయ హస్తం) కు చట్టబద్ధత – ఫైలుపై సిఎంగా తొలి సంతకం చేసిన రేవంత్ రెడ్డి – క్యాబినెట్ తొలి భేటీలోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని – అసెంబ్లీ తొలి సెషనులోనే చట్టబద్ధత కల్పిస్తామన్న సిఎం రేవంత్ రెడ్డి – రెండున్నరేళ్లు దాటినా ఆరు గ్యారంటీలకు దక్కని చట్టబద్ధత

### 12. పంచాయతీరాజ్ శాఖ - సమస్యలు

మండల, జిల్లా పరిషత్తులకు ఎన్నికలు నిర్వహించడం ... గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం ... మాజీ సర్పంచులకు పెండింగ్ బకాయిలు చెల్లించడం ... గ్రామాల నిర్వహణ కోసం కార్యదర్శుల ఖర్చు చేసిన వాటికి బిల్లులు చెల్లించడం ... పారిశుద్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడం ... అంగన్ వాడీల సమస్యలు

### 13. పౌరసరఫరాల శాఖలో అవినీతి, అక్రమాలు - ఇతర సమస్యలు

పౌరసరఫరాల శాఖలో అవినీతి ... సన్న వడ్లకు సరిగా అందని రూ.500 బోనస్ ... మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం విక్రయించే టెండర్లలో గోల్ మాల్ ... కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్లు ... కొత్త రేషన్ కార్డుల జారీ ... వాటిపై సన్న బియ్యం సరఫరా ... రేషన్ డీలర్లకు నెలకు రూ.ఐదు వేల గౌరవ వేతనం, కమిషన్ పెంపు

### 14. ఆటో డ్రైవర్లను ఆదుకోవడం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవడం ... ప్రతి ఆటో డ్రైవరుకు 0 రూ.12 వేల ఆర్థిక సహా యం చేస్తామన్న కాంగ్రెస్ మేనిఫెస్టో హామీని అమలు చేయడం

15. గృహ నిర్మాణ శాఖ – ఇందిరమ్మ ఇళ్ల హామీలు – సమస్యలుఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లుల పెండింగు ... ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ... డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ ... పట్ట ణాలు, నగరాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయడం

16. విద్యుత్ రంగ సమస్యలు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా ... నష్టాల్లో డిస్కములు ... గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ ప్లాంటుల ఏర్పాటులో, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో జరిగిన అవినీతి, అక్రమా లు ... వీటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ కమిషన్ ... మరి బాధ్యులపై చర్యలేవీ ... తెల్ల ఏనుగుల్లా మారిన యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లు

17. వైద్య, ఆరోగ్య శాఖ – సమస్యలు ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్య శ్రీ స్కీము బకాయిలు ... అంబులెన్స్ ల (108, 104) ఆధునీకరణ ... ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో లేని మందులు ... జిల్లా కేంద్రంలో, అసెంబ్లీ నియోజకవర్గాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు ...

18. రాజధాని హైదరాబాద్ ఆగమాగం – అశాస్త్రీయంగా GHMC విభజన .... మూడు కార్పోరేషన్లలో అశాస్త్రీయంగా డివిజన్ల ఏర్పాటుపై వచ్చిన అభ్యంతరాలను పట్టించుకోకపోవడం ... రూ.లక్షన్నర కోట్లతో మూసీ ముస్తాబు ప్రాజెక్టు – చెరువుల పునరుద్దరణ పేరుతో హైడ్రా సంస్థ ఆగడాలు, అక్రమ కూల్చివేతలు, కోర్టుల్లో కేసులు – పేదలు, మధ్యతరగతి వారి నివాసాల కూల్చివేతలు – నిర్వాసితులైన పేదలు – కాలేజీ పేరుతో ఎంఐఎం నేత ఓవైసీ అక్రమ నిర్మాణాలను ముట్టుకోని హైడ్రా – దుర్గం చెరువు పరిధిలో సిఎం సోదరుడి నివాసానికి నోటీసులు ఇచ్చి వదిలేసిన హైడ్రా

19. శాంతిభద్రతలు – ఆంక్షలు పెరగడం – కొరవడిన ప్రజాస్వామ్య స్ఫూర్తి – బలవంతపు భూసేకరణలు – రైతులపై అక్రమ కేసులు – బాధితులకు అండగా నిలబడిన నేతల నిర్బంధాలు, అరెస్టులు ... వేతనాలు పెంచాలన్న ఆశా వర్కర్లపై పోలీసుల దౌర్జన్యం – మహిళలపై దాడులు ... నిరుద్యోగుల ఆందోళనలను ప్రభుత్వం ఉక్కు పాదంతో అణచి వేయడం ... ప్రతిపక్ష నేతల హౌజు అరెస్టులు, నిర్బంధాలు

20. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడము ... ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో బస్సు సర్వీసుల్లో కోత

21. దేవాలయాలపై దాడులు – బాధ్యులను శిక్షించని కాంగ్రెస్ సర్కారు – బంజారాహిల్స్ లోని పాత పెద్దమ్మ తల్లి ఆలయం కూల్చివేత – హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం – దేవాలయ భూముల అన్యాక్రాంతాన్ని అరికట్టని సర్కారు

22. చేనేత రంగ సమస్యలు – ఉపాధి కరువై నేత కార్మికుల ఆత్మహత్యలు ... చేయూత కరువైన చేనేత రంగం ... చేనేత సంఘాలకు జరగని ఎన్నికలు ... చేనేత రుణాల మాఫీ, అభయ హస్తం, త్రిఫ్ట్ వంటి పథకాల అమలు ... స్పిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు కొరవడిన ప్రోత్సాహకం

### 23. ఎక్సయిజ్ శాఖ - సమస్యలు

ఎక్సయిజ్ శాఖలో అవినీతి, మద్యం షాపుల లైసెన్సుల జారీలో వసూళ్ల పర్వం ... మద్యం విక్రయాలను పెంచడం ద్వారా ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచుకోవడాన్ని గతంలో వ్యతిరేకించిన కాంగ్రెసు, ఇపుడు అధికారంలోకి వచ్చాక అదే పని చేస్తూ బీఆర్ఎస్ బాటలోనే నడవడం ... బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేస్తామన్న అమలును విస్మరిం చడం కల్తీ కల్లును అరికట్టడం కల్లుగీత కార్మికుల సమస్యలు ...



### 24. ప్రజా దర్బారు నిర్వహణ - ఇతర సమస్యలు

ప్రజాదర్బారులో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం ... సమగ్ర పోర్టల్ ఏర్పాటు ... పౌర సేవల హక్కుల చట్టం ఏర్పాటు ... తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగము, నెలకు రూ.25 వేల పెన్షన్

25. ఆర్థిక రంగం – అప్పులు పెరగడం – గత బీఆర్ఎస్ సర్కారు మాదిరే కార్పొరేషన్ల ద్వారా రుణాలు ... భూముల తనఖా, అమ్మకం ద్వారా రుణాల సమీకరణ – రెవెన్యూ పెరుగుదల లేకపోవడం – ఆర్థిక సంక్షోభం దిశగా రాష్ట్ర పయనం

26. నిబంధనలకు విరుద్దంగా ఫార్మాసిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ... ఫార్మాసిటీని రద్దు చేస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి ఉందా లేదా ... ఫార్మా సిటీ ఉన్నట్టా, లేనట్టా ... ఫార్మా క్లస్టర్ల పేరుతో బలవంతంపు భూసేకరణ ... ఫ్యూచర్ సిటీ హడావుడి ... ఫ్యూచర్ సిటీకి రోడ్డు పేరుతో బలవంతపు భూసేకరణ ... ఆర్ఆర్ఆర్ కోసం కూడా బలవంతపు భూసేకరణ

27. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అక్రమాలపై విచారణ దాటవేస్తున్న కాంగ్రెస్ సర్కార్ ... కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై విచారణ కమిషన్ నివేదిక, ఈ–కార్ ఫార్ములా రేసింగ్ స్కామ్, మిషన్ భగీరథలో అవినీతి, అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్ కేసు, ORR టెండర్లలో అవకతవకలు ... ధరణి అక్రమాలపై విచారణ ఎందుకని జరగడం లేదు

28. మంత్రుల అవినీతి ... సీఎం రేవంత్ రెడ్డి సోదరుడి కంపెనీకి రూ.వందల కోట్ల విలువైన భూముల కేటాయింపు సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ కూతురు చేసిన ఆరోపణలు, కమిషన్లు ఇస్తేనే బిల్లులు విడుదలవుతున్నాయంటూ కాంట్రాక్టర్లు, రిటైర్డు ఉద్యోగులు ఆర్థిక మంత్రిపై చేసిన ఆరోపణలు ... దక్కన్ సిమెంట్ డైరెక్టరును మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ బెదిరించడం ... వివిధ శాఖల్లో మంత్రుల అవినీతి

29. హిల్ట్ పాలసీ – పారిశ్రామిక విధానం ... ORR లోపల ఉన్న 22 పారిశ్రామిక వాడలకు చెందిన 9,292 ఎకరాల భూములను మల్టి యూజ్ జోన్లుగా కన్వర్షన్ చేయడపై కొరవడిన పారదర్శకత ... గత బీఆర్ఎస్ హాయంలో జరిగిన పారిశ్రామిక భూముల బదలాయింపు అక్రమాలు ... విజన్ 2047–జరిగిన పారిశ్రామిక ఒప్పందాలు – వాస్తవంగా వచ్చిన పెట్టుబడులు


30. సింగరేణి సంస్థలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలు, అవినీతి అంశాలు – సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు లెక్కల్లో గందరగోళం – సింగరేణి టెండర్లలో అవినీతి, అక్రమాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలు – సిబ్బంది వేతన సవరణ సమస్యలు – గుర్తింపు కార్మిక సంఘం కోసం ఎన్నికలు ...

# రూ. 200 కోట్లతో ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధి

- **రూ. 117 కోట్లకు అదనంగా మరో రూ. 80 కోట్లు మంజూరు చేసిన ప్రజా ప్రభుత్వం**
- **వేకువజామున 2:58 గంటల శుభ ముహూర్తంలో భూమిపూజ, శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ధర్మపురి వెలుతురు సెప్టెంబర్ 07:**

దక్షిణ కాశీగా, పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన భవిష్యత్తు సరికొత్త శోభను సంతరించుకోనుంది. దశాబ్దాలుగా భక్తులు, స్థానికులు కోరుకుంటున్న ఆలయాభివృద్ధి కల నెరవేరుస్తూ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సోమవారం వేకువజామున 2:58 గంటలకు వేద పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో రూ. 10 కోట్లతో చేపట్టిన శ్రీ ఉగ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు వైభవంగా భూమిపూజ చేసి శంకు స్థాపన చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గార్లు ఆలయంలోని శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి, శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి మంత్రోచ్చారణలతో వేదాశీర్వచనం గావించి, స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.



### మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం!

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... "మనందరికీ ఇష్టదైవమైన ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధిపై గతంలో చాలామంది మాటలు చెప్పారే తప్ప అర్ధరూపాయి కూడా ఇవ్వలేదు. కానీ మన ప్రజా ప్రభుత్వం స్వామివారి దివ్యానుగ్రహంతో, ప్రజల ఆశీస్సులతో రూ. 117 కోట్లను ముందే మంజూరు చేసింది. స్థానిక శాసనసభ్యులు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం అదనంగా నిధులు కోరగా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గసూచనల మేరకు మరో రూ. 80 కోట్లను సాంక్షన్ చేశామని, మొత్తంగా రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో ధర్మపురి క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టాం" పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల్లో భాగంగా గోదావరి నది ప్రవాహం వెంట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

### ఆలయంలో చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాలు

రూ. 10 కోట్లతో శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునర్నిర్మాణం. రూ. 58.55 కోట్లతో మొత్తం 9 రకాల మౌలిక వసతులు, ఆలయాభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన. రూ. 22.16 కోట్లతో పవిత్ర గోదావరి పుష్కరాల నిమిత్తం నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం. రూ. 2.48 కోట్లతో ధర్మపురి మండలం తిమ్మపూర్ వద్ద నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన. ప్రజా ప్రభుత్వం చొరవతో ప్రసిద్ధ ధర్మపురి పుణ్యక్షేత్రం రూ. 200 కోట్ల వ్యయంతో దివ్య ఆధ్యాత్మిక కేంద్రంగా మారబోతుండటం పట్ల భక్తులు, ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జహీరాబాద్‌లో ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ అధికారులు సిద్ధం

- **సెప్టెంబర్ 9 నుంచి ప్రధాన రహదారుల్లో ప్రత్యేక చర్యలు**

**జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భవాని మందిరం రోడ్డు, హనుమాన్ మందిరం రోడ్డు, లతీఫ్ రోడ్డు, మెయిన్ రోడ్డు, సిద్ధి హోటల్ నుంచి ఆదర్శనగర్ వరకు ఉన్న రహదారులతో పాటు పట్టణ ప్రణాళిక అధికారులు గుర్తించిన ఇతర ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించనున్నారు.ఆక్రమణల తొలగింపు కార్యక్రమంపై మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనిస్, మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని సూచించారు.ప్రధాన రహదారుల విస్తరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు, పట్టణ సుందరీకరణలో భాగంగానే ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.





# ఫీజు రీయింబర్స్‌మెంట్, 22-A భూ సమస్యలపై చర్చ జరగకుండా కాంగ్రెస్ - బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ డ్రామాలు

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు ఫైర్**
- **పోలీసుల లాఠీలతో ఉద్యమాలను ఆపలేరు.. సభ లోపల, వెలుపల మా పోరాటం కొనసాగుతుంది**
- **గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తాం.. జిల్లాల్లో కలెక్టరేట్లను ముట్టడిస్తాం**



**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 07:**

తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ధరణి, భూభారతి పేరుతో వివాదాస్పద 22–A నిషేధిత జాబితాలో చేర్చిన లక్షలాది ఎకరాల ప్రైవేటు భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ వేదికగా తాము చేపట్టిన పోరాటాన్ని అణచివేయాలని చూడటం సిగ్గుచేటని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతోందన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలన్నింటికీ వెళ్లి దాదాపు 8 లక్షల మంది విద్యార్థుల సంతకాలతో కూడిన వినతి పత్రాలు సేకరించి, వాటిని ఇచ్చేందుకు సమయం అడిగితే సీఎం రేవంత్ రెడ్డి కనీసం స్పందించలేదని ఆరోపించారు. సీఎం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడానికి సమయం ఉంటుంది కానీ, లక్షలాది మంది విద్యార్థుల గోడు వినే తీరిక లేకపోవడం శోచనీయమన్నారు. ఈ మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ గారు, పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్ గారు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణి రుద్రమ గారు, సోలంకి శ్రీనివాస్ గారు, డా. పుల్లారావు గారు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే గారు, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ గారు, మీడియా ప్యానలిస్ట్ రాజు ముదిరాజ్ గారు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు గారు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా... కనీసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (CS)కైనా వినతిపత్రం ఇద్దామని వెళ్తే సెక్రటేరియట్ గేటు బయటే అడ్డుకుని అక్రమంగా అరెస్ట్ చేశారని రాంచందర్ రావు గారు గుర్తుచేశారు. ఈ సమస్యపై గతంలో రెండు రోజుల పాటు శాంతియుతంగా దీక్ష చేశామని, విద్యార్థుల కోరిక మేరకు నేడు ఇందిరా పార్క్ వద్ద విద్యార్థి మహాసభ నిర్వహించడానికి ఐదు రోజుల ముందే న్యాయవాది అయిన పార్టీ ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ ద్వారా పోలీసులకు అధికారికంగా దరఖాస్తు చేశామన్నారు . పోలీసులు పర్మిషన్ ఇస్తామని చెప్పి, చివరకు "పైనుంచి ఒత్తిళ్లు ఉన్నాయంటూ" సాయంత్రం పూట రిజెక్ట్ చేయడం వెనుక ప్రభుత్వ కుట్ర దాగి ఉందని విమర్శించారు. ప్రభుత్వం తమ హక్కులను కాలరాస్తున్నందుకే ప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీ ముట్టడికి నడుం బిగించాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు అమానుషంగా లాఠీలతో విరుచుకుపడ్డారని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ముట్టడి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా కార్యకర్తలు, నాయకులను అక్రమంగా నిర్బంధించారని, జిల్లాల్లో ముందస్తు హౌస్ అరెస్టులు చేశారని వివరించారు. పోలీసుల తోపులాటలో మహిళా కార్పొరేటర్ సరళ తీవ్ర అస్వస్థతకు గురై యశోద ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారని, మీడియా ప్యానలిస్ట్ ప్రభాగౌడ్, రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్, దళిత నేత అయిన జనగామ జిల్లా అధ్యక్షుడు రమేష్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని గౌరవించి మాట్లాడే బీజేపీ నాయకులపై అక్రమ కేసులు, దాడులు చేస్తూ రాష్ట్రంలో తీవ్రమైన 'లాలెస్‌నెస్' (చట్టరాహిత్యం) సృష్టించారని మండిపడ్డారు.తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఆడుతున్న మ్యాచ్ ఫిక్సింగ్ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలే నేడు 22–A భూ సమస్యలకు, ఫీజుల బకాయిలకు కారణమని, ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ 'భూభారతి' పేరుతో భూబకాసురుల్లా మారి 50 లక్షల మంది సామాన్య రైతులను ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. ఈ రెండు ప్రధాన ప్రజా సమస్యలపై అసెంబ్లీలో బీజేపీ చర్చ లేవనెత్తకుండా ఉండేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని విమర్శించారు. ఒకరు నల్ల బట్టలు, మరొకరు తెల్ల బట్టలు వేసుకుని ఒకరిపై ఒకరు డ్రామాలు ఆడుతూ అసెంబ్లీని పక్కదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ నిరంకుశ పోకడలపై బీజేపీ జాతీయ నాయకత్వం పూర్తి నివేదిక కోరిందని, వారికి అన్ని వివరాలు అందజేశామని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై రేపు గవర్నర్ గారిని కలిసి సమగ్ర వినతిపత్రం అందజేస్తామని, అలాగే రాష్ట్రంలోని కలెక్టరేట్ల ముట్టడి చేపట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయించేంత వరకు, రాష్ట్ర ప్రభుత్వం 22–A భూ సమస్యలను పరిష్కరించేంత వరకు బీజేపీ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రాంచందర్ రావు గారు తేల్చిచెప్పారు.

# ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి తెలిపారు. ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి కీలక సమావేశం నిర్వహించారు.ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాలు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురాగా.. ఆయా అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. గత ఆగస్టు 23న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కూడా సమీక్షించారు.సమావేశంలో కీలక నిర్ణయాలు, అంశాలు

### ఈవీ ఆటోలపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి లాస్ట్ మైల్ కనెక్టివిటీ పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి విధానంపై ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు.

### ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కార్మిక శాఖతో కలిసి ప్రాధాన్యతా ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని కేబినెట్‌లో చర్చించి శాసనసభలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఆటో ఛార్జీల పెంపునకు సానుకూల నిర్ణయం

2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆటో ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని చెప్పారు. ఎంత మేర ఛార్జీలు పెంచాలనే అంశాన్ని కమిటీ నిర్ణయించి ప్రభుత్వానికి సూచనలు చేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపును అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

### పెండింగ్, తిరస్కరించిన పర్మిట్లకు పరిష్కారం

జీఓ ఎంఎస్ నం.263 కింద తిరస్కరించబడిన కేసులు, గడువు ముగిసిన పర్మిట్లకు సంబంధించిన ఆటో రిక్షా పర్మిట్ కోటాను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### అగ్రిగేటర్ పాలసీపై అధ్యయనానికి కమిటీ

అగ్రిగేటర్ల ద్వారా వైట్ ప్లేట్ వాహనాల వినియోగంపై ఆటో సంఘాలు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించిన అగ్రిగేటర్ పాలసీలో ద్విచక్ర వాహనాలను ఉపయోగించుకునే అవకాశం ఉందని, దీనివల్ల నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో అగ్రిగేటర్ పాలసీపై రవాణా శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

### ఇతర జిల్లాల ఆటోలపై నిబంధనల అమలు

ఇతర జిల్లాలకు చెందిన ఆటోలు హైదరాబాద్ నగరంలో తిరగకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆటో సంఘాలు కోరాయి. దీనిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ హామీ ఇచ్చింది. నిబంధనల అమలులో నగర ఆటో కార్మిక సంఘాలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి సూచించారు.

### సారథి పోర్టల్‌లో ఆటో లైసెన్స్ సమస్యకు పరిష్కారం

సారథి పోర్టల్‌లో ఆటో రిక్షా డ్రైవింగ్ లైసెన్స్ కేటగిరీకి సంబంధించి స్పష్టత లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం ఎల్ఎంవీ (లైట్ మోటార్ వెహికల్) లైసెన్స్ ఉన్న వారికి ఆటో నడిపే విషయంలో ఉన్న నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

### హైదరాబాద్‌లో 18,766 ఆటోలకు రెట్రోఫిట్మెంట్ కోసం ఆర్థిక సహాయం

హైదరాబాద్ నగరంలో డీజిల్, పెట్రోల్ ఆటోల స్థానంలో పర్యావరణహిత వాహనాలను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచన ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆటోలను రెట్రోఫిట్మెంట్ చేసుకునేందుకు హైదరాబాద్ నగరంలోని సుమారు 18,700 ఆటోలకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు.ఈ కార్యక్రమం కోసం వివిధ శాఖల సమన్వయంతో సుమారు రూ.200 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

### ఆటో డ్రైవర్లకు ప్రత్యేక బీమా పాలసీ పై

ఆటో డ్రైవర్ల ప్రమాద, సహజ మరణ బీమా అంశంపై కార్మిక శాఖతో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆటో డ్రైవర్లతో పాటు ఇతర వర్గాలకు కూడా భరోసా కల్పించేలా ప్రత్యేక బీమా పాలసీని తీసుకురావడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని చెప్పారు. వివిధ శాఖల సమన్వయంతో ఆటో కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ సమావేశంలో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, అడిషనల్ కమిషనర్ రమేష్, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, వెంకట రమణ, కార్మిక శాఖ అధికారులు, వివిధ ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజకీయ అజ్ఞానిలా మాజీ మేయర్ రవీందర్ సింగ్ మాట్లాడుతున్నారు

- **బిఆర్ఎస్ కు ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చిన ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రావడం లేదు...**
- **రవీందర్ సింగ్ రాజకీయ సన్యాసం చేయడానికి సిద్ధంగా ఉండాలి..**
- **మేయర్ కోలగాని శ్రీనివాస్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం ...**
- **బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**




**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 07:**

కరీంనగర్ అభివృద్ధికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఒక్క రూపాయి కూడా తేవలేదంటూ మాజీ మేయర్, బీఆర్ఎస్ నేత రవీందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అజ్ఞానానికి, దివాలాకోరుతనానికి నిదర్శనమని, బి ఆర్ ఎస్ పార్టీకి ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చిన ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రావడం లేదని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు మండిపడ్డారు. సోమవారం పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రవీందర్ సింగ్ విసిరిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, బండి సంజయ్ కృషితోనే కరీంనగర్‌కు వేల కోట్ల నిధులు వచ్చాయని లెక్కలతో సహా నిరూపిస్తామని స్పష్టం చేశారు. రవీందర్ సింగ్ కూడా ఆయన చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని , బండి సంజయ్ కుమార్ తీసుకువచ్చిన నిధుల విషయం తేలిన తర్వాత రవీందర్ సింగ్ రాజకీయ సన్యాసం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బల్దియాను ఉద్ధరించిందేమీ లేకపోవడంతోనే నగర ప్రజలు ఆ పార్టీని సింగిల్ డిజిట్‌కు పరిమితం చేశారని ప్రవీణ్ రావు ఎద్దేవా చేశారు. ప్రజలు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, బీజేపీపై ఉన్న విశ్వాసంతోనే నగరపాలక సంస్థపై కాషాయ జెండా ఎగిరిందని తెలిపారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ పై రవీందర్ సింగ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ అధికారంలోకి ఆరు నెలలోపే ప్రతి డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారని తెలిపారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉండి కార్పొరేషన్ లో అభివృద్ధిని నిర్వీర్యం చేసి ఇప్పుడు మేయర్ పై అనవసరమైన వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలన్నారు.. రవీందర్ సింగ్ సవాల్‌ను స్వీకరిస్తూ, బండి సంజయ్ ద్వారా కేంద్రం నిధుల వివరాలను ప్రవీణ్ రావు మీడియా ముందుంచారు:

### స్మార్ట్ సిటీ & అర్బన్ ఛాలెంజ్ ఫండ్:

కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ నిధులు ఎంపీ బండి సంజయ్ కృషితోనే వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు జమ చేయలేక చేతులెత్తేసింది. అయినా అభివృద్ధి ఆగిపోకూడదనే ఉద్దేశంతో కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకువచ్చిన ఘనత బండి సంజయ్‌దే. ప్రస్తుతం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర నిధులను నగరపాలక సంస్థకు తెచ్చింది ఎవరనేది రవీందర్ సింగ్‌కు తెలియదా అని ప్రశ్నించారు.

### ఎంపీలాండ్స్ నిధులు:

ఎంపీ లాండ్స్ నిధులతో కరీంనగర్‌లో లెక్కలేనన్ని బోర్లు, కమ్యూనిటీ హాళ్లు, అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ. 17 కోట్లు ఖర్చు చేశారు.

### సీఎస్ఆర్ (CSR) సేవలు:

ఎంపీ లాండ్స్ నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్ ద్వారా భారీగా నిధులు సాధించి ప్రజలకు సేవ చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న దాదాపు 20,000 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రులకు రూ. కోటికి పైగా నిధులతో వైద్య సామాగ్రి, ఉచిత అంబులెన్సులు అందజేశారు. కరోనా సమయంలోనూ ప్రభుత్వ ఆసుపత్రికి సేవలు అందించడమే కాకుండా, మహిళల కోసం సీఆర్ఎఫ్ ఫండ్ కింద ఎలక్ట్రిక్ ఆటోలు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

### నేషనల్ హైవే & రైల్వే అభివృద్ధి:

కరీంనగర్ – వరంగల్ నేషనల్ హైవే కోసం దాదాపు రూ. 4,500 కోట్లు తీసుకొచ్చి పనులు పూర్తి చేయించారు. కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను 'అమృత్ భారత్' కింద ఆధునీకరించడానికి దాదాపు రూ. 50 కోట్లు మంజూరు చేయించారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్ఓబి (ROB) నిర్మాణం తమవల్ల కాదంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేతులెత్తేస్తే, 'సేతు బంధు' పథకం కింద కేంద్ర నిధులతో దాదాపు రూ. 150 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు.

### గ్రామీణ అభివృద్ధి:

పార్లమెంట్ పరిధిలో ప్రతి సంవత్సరం ఈజీఎస్ (EGS) నిధులతో గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు; కేంద్ర పథకాల నిధులతో మండలాల్లో కొత్త రోడ్లు, రెండు వరుసల రోడ్ల కోసం వందల కోట్ల రూపాయలు వెచ్చించారు.ఇంకా లెక్కలేనన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను రవీందర్ సింగ్ కు తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.బండి సంజయ్ ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేసి తప్పుకుంటానని రవీందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు ఆయన కట్టుబడి ఉండాలని ప్రవీణ్ రావు డిమాండ్ చేశారు. దమ్ముంటే ఈ అంశంపై చర్చకు వేదిక, తేదీని రవీందర్ సింగ్ ప్రకటించాలని సవాల్ విసిరారు. లేనియెడల, నిరాధార ఆరోపణలు చేసినందుకు నగర ప్రజలకు క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు బండారి వేణు, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గాజ రమ శివరాం, కర్రె పద్మ అనిల్, కొలిపాక శ్రీనివాస్ దేవసాని సరస్వతి సత్యనారాయణ, జాడి బాల్రెడ్డి, తోట అనిల్, వంగల రవి గోపాల్, కేవీ పీపీ చంద్ర, దయ్యాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమంటే.. మొత్తం దళిత సమాజాన్ని అవమానించినట్లే

- **తాతా మధు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి, శాసన వ్యవస్థ గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉన్నాయి**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్సీని హౌస్ నుంచి డిస్మిస్ చేయాలి**
- **శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 7:**

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి, శాసన వ్యవస్థ గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉన్నాయని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని ఉద్దేశించినవి కాదని, మొత్తం దళిత సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీని హౌస్ నుంచి డిస్మిస్ చేయాలని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు బాధాకరంగా ఉందని మంత్రి అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు, ఆందోళనలు చేయడాన్ని తాము వ్యతిరేకించబోమని.. అయితే రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత పదజాలం ఉపయోగించడం మాత్రం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దళితుడు కాబట్టే ఆయనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని మంత్రి అన్నారు. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు మొత్తం దళిత సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయని అన్నారు. దళిత సంఘాలు కూడా ఈ అంశాన్ని గమనించాలని కోరారు. దళితుల ఆత్మగౌరవం, హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదని మంత్రి అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి ఇస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలోనూ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని అన్నారు.2018 బీఆర్ఎస్ మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి ఇస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చిందని, పదేళ్లు



అధికారంలో ఉన్నప్పటికీ అమలు చేయలేదని మంత్రి గుర్తుచేశారు. అందరికీ సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా పూర్తిస్థాయిలో అందించలే దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు మాత్రమే అయిందని, అప్పుడే హామీలు అమలు చేయలేదంటూ బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు పూర్తిస్థాయిలో కొనసాగుతోందన్నారు. మిగిలిన హామీలను కూడా వచ్చే రెండున్నరేళ్లలో ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అవినీతికి పాల్పడిందని అన్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ నేతల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.

# అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల అరెస్టులు అప్రజాస్వామికం

- **ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా? కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి: ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం**

**హైదరాబాద్, వెలుతురు, సెప్టెంబర్ 7:**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ నల్ల దుస్తులతో నిరసన తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం తీవ్రంగా ఖండించారు.ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించేందుకు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు శాంతియుతంగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చారని ఆయన తెలిపారు. గతంలో రాహుల్ గాంధీ నల్ల దుస్తులతో పార్లమెంట్‌కు హాజరైనప్పుడు అభ్యంతరం వ్యక్తం చేయని వారు, ఇప్పుడు బీఆర్ఎస్ నేతల నిరసనపై ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని పిలిచి, సభలోకి వెళ్లకముందే నేతలను అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామిక చర్య అని అనిల్ కూర్మాచలం విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం వల్లే పోలీసులను ఉపయోగించి ప్రతిపక్ష నేతలను అడ్డుకుంటోందని ఆరోపించారు. ము ఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసు లు వ్యవహరించిన తీరు




తీవ్రంగా అభ్యంతరకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నేతల గొంతును అరెస్టులతో అణచివేయడం సరికాదన్నారు.ప్రజా సమస్యలను లేవనెత్తిన ప్రతిసారీ అరెస్టులకు పాల్పడటం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను అవమానిస్తోందని అనిల్ కూర్మాచలం అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల ను, ప్రజల గొంతును అణచివేసే చర్యలకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెబుతారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనిల్ కూర్మాచలం హెచ్చరించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com